

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 10 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 60 పేజీలు : 4 వెల : రూ 3-00







## ఎన్ని ఒడిదుడుగులు ఎదురైనా ఇచ్చినా హామీలను నెరవేరుస్తాం

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థం చేసింది చంద్రబాబే పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ




విజయనగరం అక్టోబర్ 9 కేంద్ర నిబంధనల మేరకు ఇళ్ల స్థలాలు కేటాయించామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 220 చదరపు అడుగుల స్థలం ఇవ్వాలని నిబంధన ఉంటే.. 270 చదరపు అడుగుల స్థలం కేటాయించామని తెలిపారు. అధికారం కోల్పోయిన టీడీపీ.. సంక్షేమాన్ని అడ్డుకునేందుకే కేసులు వేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలని న్యాయస్థానాన్ని అభ్యరిస్తామన్నారు. సాంకేతిక అంశాలు కాకుండా.. ఏ స్ఫూర్తితో చేస్తున్నామో చూడాలని కోరతామని మంత్రి తెలిపారు. ఎన్ని ఒడిదుడుగులు ఎదురైనా ఇచ్చినా హామీలను నెరవేరుస్తామని మంత్రి బొత్స అన్నారు. "రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థం చేసింది చంద్రబాబే. గతంలో అధిక టారిఫ్‌లకు విద్యుత్ కొనుగోలు చేయడం వల్లే విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లో కూరుకున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలను పెండింగ్‌లో పెట్టింది. ఆ బకాయిలన్నింటినీ మా ప్రభుత్వం చెల్లిస్తోందని" మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు

## పునరుజ్జీవం దిశగా ఈశాన్య భారతం: వెంకయ్యనాయుడు



ఈటానగర్ : ఏడేండ్లుగా ఈశాన్య భారతంలో వస్తున్న మార్పులు ఈ ప్రాంతం భవిష్యత్‌లో సాధించే మరిన్ని విజయాలకు బాటలు వేస్తున్నాయని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతం ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితుల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నదన్నారు. ఈశాన్య భారతం పునరుజ్జీవనం దిశగా అడుగులు వేస్తున్నదని, ఈ ప్రాంతాభివృద్ధిలో నవశకం ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. శనివారం అరుణాచల్ ప్రదేశ్ శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. చట్టసభల పనితీరును పరిస్థితుల్లో మార్పు రావాలని, ప్రజల సమస్యలను ప్రస్తావించి, చర్చించి వాటికి పరిష్కారం సూచించేలా చట్టసభలు ఉండాలని వెంకయ్యనాయుడు సూచించారు. 2015-20 మధ్యకాలంలో అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ కనిష్టంగా ఒకరోజు, గరిష్టంగా 6 రోజులపాటు సమావేశమైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఈ ధోరణి ఆందోళనకరమన్నారు. ఈశాన్య భారతంలోని రాష్ట్రాలన్నీ తమ సమావేశాల సమయాన్ని కాస్త పొడిగించుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. మొత్తం 498 మంది శాసనసభ్యుల్లో 4 శాతం మాత్రమే మహిళలుండటం సరికాదని, చట్టాల రూపకల్పనలో మహిళలకు సరైన ప్రాతినిధ్యాన్ని కల్పించాలని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014లో 'యాక్ట్ ఈస్ట్ పాలసీ' ని తీసుకొచ్చే వరకూ ఈ ప్రాంతంలో ఆకాంక్షలకు, వాటిని పూర్తిచేయడానికి మధ్య స్పష్టమైన అంతరం ఉండేదని వెంకయ్యనాయుడు అన్నారు. మానవాభివృద్ధి సూచీ-2019 ప్రకారం, ఈశాన్య భారతంలోని ఎనిమిది రాష్ట్రాల్లో ఏడు రాష్ట్రాలు జాతీయ సగటుకంటే మంచి స్థానంలో నిలిచిందని చెప్పారు. శాసనసభ్యులను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం.. అరుణాచల్ ప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో నెలకొల్పిన గ్రంథాలయాన్ని, డోర్జీ ఖండూ సమావేశ ప్రాంగణాన్ని ఉపరాష్ట్రపతి జాతికి అంకితం చేశారు. అనంతరం ప్రాంగణంలో కాగితం రీసైక్లింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అరుణాచల్ ప్రదేశ్ శాసనసభ స్పీకర్ ప్రసాంగ్ దోర్, ముఖ్యమంత్రి పెమా ఖండూ, విపక్షనేతతోపాటు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీ హైకోర్టు సీజేగా ప్రశాంత్‌కుమార్ మిశ్రా



ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీజేగా ప్రశాంత్‌కుమార్ మిశ్రా నియమితులయ్యారు. ఏపీ, తెలంగాణ హైకోర్టులకు చీఫ్ జస్టిస్‌ల నియామకం జరిగింది. తెలంగాణ హైకోర్టు సీజేగా సతీష్ చంద్రశర్మ నియమితులయ్యారు. కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమెదం తెలిపారు.

## ఏపీలో కొత్తగా 629 కరోనా కేసులు.. 8 మంది మృతి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు స్థిరంగా కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 45,818 మంది నమూనాలు పరీక్షించగా 629 కొత్త కేసులు నమోదయ్యాయి. ఎనిమిది మంది మృతి చెందారు. కరోనా నుంచి నిన్న 797 మంది కోలుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 8,134 యాక్టివ్ కేసులు ఉన్నాయని వైద్యారోగ్యశాఖ బులెటిన్‌లో పేర్కొంది. కొవిడ్ వల్ల ప్రకాశంలో ముగ్గురు, కృష్ణాలో ఇద్దరు, చిత్తూరు, తూర్పు గోదావరి, విశాఖపట్నంలలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు.



## బద్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.792 కోట్లు: పెద్దిరెడ్డి



వైఎస్సార్: కాంగ్రెస్ పార్టీ పునాదులు కదిలిపోయాయి.. బీజేపీకి అడ్రెస్ లేదు.. ఇలాంటి పార్టీలు ఏ అర్హతతో ఓట్లు అడుగుతాయి అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు అనే బేధం చూడకుండా సంక్షేమం అందిస్తున్నారు. బద్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.792 కోట్లు కేటాయించాము. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కరం కోసం బ్రహ్మం సాగర్ ద్వారా పనులు చేస్తున్నాం నియోజకవర్గ పరిధిలో ఐదు వేల ఇళ్లు ఇచ్చాం. నియోజకవర్గ అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పెద్దిరెడ్డి తెలిపారు. "సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా మా ముఖ్యమంత్రి సమపాళ్లతో అభివృద్ధి చేస్తున్నారు. బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారు. 75 వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చామని అంటున్నారు.. 75 కాదు లక్ష కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల కోసం ఇచ్చాం. అప్పులు ఎక్కువ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు, కరోనా సంక్షోభంలో ప్రజలకు అండగా నిలిచాము.


## ఏపీలో అభివృద్ధి దిగజారిపోయింది: పవన్



హైదరాబాద్: ఏపీలో అభివృద్ధి దిగజారిపోయిందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శించారు. హైదరాబాద్‌లో జనసేన కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు కులాల మధ్య పోరాటం జరుగుతోంది. అభివృద్ధిని అడ్డుకునే వారు ఎవరైనా సరే బద్ధ శత్రువులే. రాజకీయ నేతలు నాకు శత్రువులు కారు. ప్రపంచం మారాలి. సమాజం మారాలని కోరుకుంటాం. ఏదైనా సరే అడుగుపెడితే తప్ప అనుభవం రాదు. గెలుస్తామా.. ఓడుతామా నాకు తెలియదు. నేను రాజకీయాల్లోకి వస్తుంటే భయపెట్టారు. మార్పు కోసం.. బలమైన సామాజిక మార్పుకోసం రాజకీయాల్లోకి వచ్చా. అన్నిటికీ సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చా. రాజకీయాల్లో మత ప్రస్తావన ఉండకూడదు. కులం, మతం, రంగు, ప్రాంతం మనకు తెలియకుండా జరిగిపోతాయ్. కులాలను రెచ్చగొట్టడం నా ఉద్దేశం కాదు" అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

## మేం బీజేపీతో కలిసే ఉన్నాం: మనోహర్

ప్రకాశం: తాము బీజేపీతో కలిసే ఉన్నామని జనసేన నేత నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ స్టాండ్ ప్రకారమే బద్వేలులో తమ అభ్యర్థిని నిలబెట్టడం లేదని తెలిపారు. బద్వేల్ ఉపఎన్నికలో బీజేపీ గెలుపు కోసం సహకరిస్తామని ప్రకటించారు. రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెలిగొండ ప్రాజెక్టు గురించి సీఎం జగన్ ఎందుకు మాట్లాడటం లేదు? అని నాదెండ్ల ప్రశ్నించారు. రైతులను ప్రతీ విషయంలో ప్రభుత్వం మభ్యపెడుతూ మోసం చేస్తోందని దుయ్యబట్టారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. వ్యక్తిగత విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని నాదెండ్ల మనోహర్ సూచించారు.



## చైనా సమస్య జగన్‌కు ఎందుకు?: పయ్యావుల



విజయవాడ: ఏపీలో విద్యుత్ సంక్షోభానికి సీఎం జగనే కారణమని పీఏసీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ అన్నారు. రాష్ట్రం సమస్యను ఇతర దేశాలతో పోలుస్తారా అని ప్రశ్నించారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "విద్యుత్ సంక్షోభంపై ప్రధానికి రాసిన లేఖలో చైనా, యూరప్‌తో ఏపీని పోలుస్తారా? విద్యుత్ విషయంలో పొరుగున ఉన్న తెలంగాణతో పోల్చుకోలేదు. తెలంగాణలో విద్యుత్ వ్యవస్థ మెరుగ్గా ఉంటే చైనా సమస్య జగన్‌కు ఎందుకు? విభజన నాటికి ఏపీ మిగులులో ఉంటే.. తెలంగాణ లోటులో ఉంది. విద్యుత్ విషయంలో ఇప్పుడు తెలంగాణ మెరుగ్గా ఉంది. వర్షాకాలంలో.. రిజర్వాయర్లు నిండిన సమయంలో విద్యుత్ కోతలా? ఆర్థిక రంగాన్ని సంక్షోభంలోకి నెట్టినట్లే విద్యుత్ వ్యవస్థను కుదేలు చేశారు. సీఎంతో అసత్యాలు పలికిస్తూ అధికారులు ప్రధానికి లేఖ రాయించారు. విద్యుత్ సంస్థల దివాళాకు కారణం ప్రభుత్వ కక్ష సాధింపే. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకానికి ప్రధానిని బాధ్యుణ్ని చేయొద్దు. ప్రధానికి లేఖ రాసి బాధ్యత నుంచి తప్పుకోవడం సరికాదు. ట్రు అప్ పేరుతో ఛార్జీల భారాన్ని ప్రజలు భరించాలా? ప్రజలపై రూ.50 వేల కోట్ల అదనపు భారం ఎందుకు మోపుతున్నారు" అని పయ్యావుల ప్రశ్నించారు.

## రైతాంగంపై అమ్మవారి దయ ఉండాలని వేడుకున్నా: కన్నబాబు

అమరావతి: గాయత్రీదేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని మంత్రి కన్నబాబు పేర్కొన్నారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కరోనా పూర్తిగా తగ్గాలని, తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించానన్నారు. రైతాంగంపై అమ్మవారి దయ ఉండాలని వేడుకున్నానన్నారు. దసరా ఉత్సవ ఏర్పాట్లు బాగున్నాయన్నారు. దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ దసరా ఉత్సవాల ఏర్పాట్లు బాగా చేశారని కొనియాడారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివస్తున్నారన్నారు. భక్తులు కరోనా నిబంధనలు పాటించాలన్నారు. తొలిసారిగా 70 కోట్ల రూపాయలు గుడి అభివృద్ధికి కేటాయించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. దుర్గ గుడి సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కన్నబాబు పేర్కొన్నారు.



## ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణంపై హైకోర్టు తీర్పు హర్షణీయం: రఘురామ

ఢిల్లీ: ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణంపై హైకోర్టు తీర్పు హర్షణీయ ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడడం దిగజారుడుతనమని దుయ్యబట్టారు. ఒక సెంటు,



ఒకటిన్నర సెంటు స్థలంలోనే ఇంటి నిర్మాణం అవుతుందా? అని ప్రశ్నించారు. ఇళ్ల పట్టాలకు భూ సేకరణలో అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నించేవారిపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఎంఎస్‌వో లైసెన్సును ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ అనధికారికంగా వాడిందని ఆరోపించారు. దీనిపై తన ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు కేంద్ర ఐటీశాఖ మంత్రి చెప్పారని రఘురామకృష్ణరాజు తెలిపారు.

## ఇండో-చైనా 13వ రౌండ్ సైనిక చర్చలు



న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో 17 నెలలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు ఒక పరిష్కారం కనుగొనేందుకు మరోసారి సైనిక చర్చలు జరగనున్నాయి. భారత్-చైనా కార్ప్స్ కమాండర్ స్థాయి 13వ రౌండ్ చర్చలు ఆదివారం జరగనున్నాయి. చైనా వైపు ఉన్న ఛుషుల్-మోల్డో సరిహద్దు సిబ్బంది సమావేశం (బీపీఎం) పాయింట్ వద్ద ఈ చర్చలు జరుగనున్నాయి. భారత్ తరఫు ప్రతినిధి బృందానికి 14 కార్ప్స్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ పీజీకే మీనన్ సారథ్యం వహిస్తారు. చైనావైపు సౌత్ జిన్‌జియాంగ్ మిలటరీ డిస్ట్రిక్ట్ కమాండర్ మేజర్ జనరల్ లియూ లిన్ నేతృత్వం వహిస్తారు. చైనా తమవైపు ఉన్న సరిహద్దుల్లో పెద్దఎత్తున నిర్మాణాలు చేపడుతోందని, మరోసారి చైనా దుస్సాహసానికి ఒడిగట్టకుండా తాము పూర్తి దృష్టి సారించామని ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె శనివారంనాడు పేర్కొన్న నేపథ్యంలో మరో విడత సైనిక చర్చలు జరగనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సంపాదకీయం

ఆదివారం 10 అక్టోబరు 2021

## ఎయిర్ ఇండియాకు పూర్వవైభవం వచ్చేనా

భారతీయుల ఆత్మ గౌరవ ప్రతీకగా నిలిచిన ఎయిరిండియా చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలయ్యింది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ సంస్థ ? ఎయిరిండియాను ప్రైవేటీకరించేందుకు దశాబ్ధాలుగా జరుగుతున్న ప్రభుత్వ ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. అధికారికంగా ఎయిరిండియా ప్రైవేటీకరణ ప్రక్రియ ముగిసింది. ఎయిరిండియా సంస్థను ఓపన్ బిడ్డింగ్‌లో టాటా గ్రూప్ దక్కించుకుంది. దీంతో 68 ఏళ్ల తర్వాత ఎయిరిండియా సంస్థ మళ్లీ టాటా గ్రూప్ చేతికి చేరిందిరూ. 18వేల కోట్లకు ఎయిరిండియాను టాటా గ్రూప్ దక్కించుకుంది. ఆర్థిక నష్టాలతో కొట్టుమిట్టాడుతోన్న ఎయిరిండియాను టాటా సన్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని శుక్రవారం భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఓపెన్ బిడ్‌లో భాగంగా రూ. 18వేల కోట్ల బిడ్‌తో టాటా ఎయిరిండియాను సొంతం చేసుకుంది. ఈ సంస్థను దక్కించుకునేందుకు చాలా సంస్థలు బిడ్లు దాఖలు చేయగా.. టాటా సన్స్ దాఖలు చేసిన బిడ్ అన్నింటికంటే ఆకర్షణీయంగా ఉందని కేంద్ర పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం కార్యదర్శి తుహిన్‌కాంత పాండే తెలిపారు. ఇదిలా ఉంటే ఎయిరిండియా తిరిగి టాటా సన్స్ చేతుల్లోకి వెళ్లడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెటిజన్లు సైతం ఈ డీల్ పట్ల సానుకూలంగా స్పందించడం విశేషం. ఇక ఈ విషయమై తాజాగా టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా కూడా స్పందించారు. ట్విట్టర్ వేదికగా జేఆర్డీ టాటాను ప్రస్తావిస్తూ ఓ ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా రతన్ టాటా పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎయిరిండియాకు ఆయన స్వాగతం తెలిపారు. టాటా గ్రూప్స్ ఎయిరిండియా బిడ్‌ను గెలుచుకోవడం గొప్ప విషయమని అభివర్ణించిన రతన్ టాటా.. ఎయిర్ ఇండియాను పునర్ నిర్మిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. విమానయాన రంగంలో టాటా గ్రూపు తన మార్కెట్ సత్తాను మరోసారి చాటుతుందని ఆయన తెలిపారు. జేఆర్డీ టాటా నాయకత్వంలో ఒకప్పుడు ప్రపంచంలో ఎయిర్ ఇండియాకు మంచి గుర్తింపు ఉండేదని తెలిపిన రతన్ టాటా, ఆనాటి వైభవాన్ని తిరిగి పొందుతామని ధీమా వ్యక్తం చేశారు. జేఆర్డీ టాటా ఇప్పుడు ఉండి ఉంటే, ఆయన ఎంతో సంతోషించేవారని తెలిపారు. ఎయిరిండియాను దక్కించుకునేందుకు టాటా సంస్థతో పోటీపడిన స్పైస్ జెట్ రూ. 15,100 కోట్లకు బిడ్డింగ్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది చివరినాటికల్లా ఎయిరిండియా కొనుగోలు ప్రక్రియను టాటా సన్స్ పూర్తిచేయనుంది. 2021 డిసెంబరు నాటికి ఎయిరిండియా నిర్వహణ హక్కులు పూర్తిగా టాటా గ్రూప్ చేతికి చేరనుంది. ఎయిరిండియాను టాటా గ్రూప్ దక్కించుకున్నట్లు గత వారమే మీడియా వర్గాల్లో ప్రచారం జరిగినా.. సాయంత్రం కేంద్రం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. రూ. 60వేల కోట్ల అప్పుల్లో ఉన్న ఎయిరిండియా సంస్థకు 127 ఎయిర్‌క్రాఫ్ట్ ఉన్నాయి. ఎయిరిండియా ప్రస్థానం 1932లో మొదలైంది. ఏఖీఆ టాటా నేతృత్వంలో టాటా ఎయిర్‌లైన్స్ ఆవిర్భావించింది. కరాచి నుంచి ముంబైకి తొలి విమానం నడిపారు. ఇండిపెండెన్స్‌కు ముందు 1946లో టాటా ఎయిర్‌లైన్స్ పేరును ఎయిరిండియాగా మార్చారు. స్వాతంత్ర్యం తర్వాత ఎయిరిండియాలో 49 శాతం భాగస్వామ్యం తీసుకుంది ప్రభుత్వం. ఆ తర్వాత 1953లో ఎయిరిండియాను జాతీయం చేసుకున్న కేంద్రం.. తాజాగా 100శాతం పెట్టుబడులను ఉపసంహరించుకుంది. డిసెంబర్ నాటికి ఎయిరిండియా టాటా గ్రూప్ చేతికి రానుంది. దీంతో 67 ఏళ్ల తర్వాత మళ్లీ ఎయిరిండియా టాటా చేతికొచ్చింది. ప్రైవేటు రంగంలో పరిశ్రమల పెట్టుబడులను ఆహ్వానిస్తూ కేంద్రం తీసుకున్న పాలసీని స్వాగతించారు టాటా గ్రూప్స్ చైర్మన్ రతన్ టాటా. ఎయిర్ ఇండియాను దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వెల్ కమ్ బ్యాక్ ఎయిరిండియా అంటూ ట్వీట్ చేశారు. నష్టాల్లో ఉన్న ఎయిర్ ఇండియాను అమ్మేందుకు గతంలోనూ ప్రయత్నాలు జరిగాయి. 2018 మార్చిలో కేంద్రం ఎయిర్ ఇండియాలో 76 శాతం షేర్లను అమ్మేందుకు ఇంట్రెస్ట్ చూపింది. అయితే అప్పుడు ఎవరూ ముందుకు రాలేదు. తాజాగా స్పైస్ జెట్, టాటా సన్స్ బిడ్స్ వేశాయి. ఈ బిడ్‌ను టాటా సన్స్ గెలుచుకోవడంతో భారీ నష్టాల్లో ఉన్న ఎయిర్ ఇండియా ఇక టాటా సన్స్ చేతుల్లోకి వెళ్లనుంది. ప్రస్తుతం రూ. 61,562 కోట్ల అప్పుల్లో ఉంది ఎయిరిండియా. ఎయిరిండియాకి చెందిన రూ. 14,718 కోట్ల భూములు కేంద్రానికే చెందనున్నాయి. ప్రస్తుతం ఆ సంస్థ 42 అంతర్జాతీయ కేంద్రాలకు సర్వీసులు నడుపుతోంది. ప్రస్తుతం ఎయిరిండియాలోని 100 శాతం వాటాలను కేంద్ర ప్రభుత్వం టాటా గ్రూప్‌కు విక్రయించింది. టాటా గ్రూప్‌కు ఇప్పటికే ఎయిర్‌ఏషియాలో 84 శాతం వాటాలు, విస్తారాలో 51 శాతం వాటాలు ఉన్నాయి. ఇప్పుడు దీనికి అదనంగా ఎయిరిండియాలోనూ 100 శాతం వాటాలను సొంతం చేసుకోవడం విశేషం. భారత సంస్థ టాటా గ్రూప్..ఎయిరిండియాను దక్కించుకోవడం పట్ల దేశ వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది.

## కడపలో లోకల్, నాన్ లోకల్

కడప, అక్టోబరు 9, (న్యూస్ పల్స్)బద్వేలు ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ కొత్త స్ట్రాటజీతో ముందుకు వెళ్లాలని తొలుత నిర్ణయించింది. లోకల్, నాన్ లోకల్ నినాదాన్ని తెరపైకి తెచ్చింది. వైసీపీ అభ్యర్థి దాసరి సుధ నాన్ లోకల్ అంటూ ప్రచారాన్ని మొదలుపెట్టింది. ఆమె గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉండరని చెబుతోంది. టీడీపీ అభ్యర్థి రాజశేఖర్ బద్వేలులోనే ఉంటారని బాగానే ప్రచారం చేసింది. అయితే ఉన్నట్లుండి పోటీ నుంచి విరమించుకోవడంతో అభ్యర్థి రాజశేఖర్ అసంతృప్తిలో ఉన్నట్లు తెలిసింది. బద్వేలు ఉప ఎన్నిక ద్వారా తెలుగుదేశం పార్టీ రెండు రకాలుగా లబ్ది పొందాలని ప్రయత్నించాలని తొలుత భావించింది. వైసీపీ మెజారిటీని తగ్గించి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని చెప్పడం ఒకటి కాగా, రెండోది జనసేన, బీజేపీ కలసి పోటీ చేసినా వారి బలమేంటో వారికి మరొకసారి తెలియజెప్పాలని కూడా టీడీపీ భావించింది. బీజేపీతో ఉంటే జనసేనకు కనీస ఓట్లు కూడా రావన్న విషయాన్ని బద్వేలు ఉప ఎన్నిక ద్వారా చెప్పాలని అనుకుందితిరుపతి ఉప ఎన్నికల్లో బీజేపీ, జనసేన బలం ఏంటో తెలిసింది. అప్పటి నుంచే పవన్ కల్యాణ్ వైఖరిలో మార్పు కన్పించింది. బీజేపీతో కలసి పోటీ చేస్తే వచ్చే ఎన్నికల్లో కనీస స్థానాలను కూడా సాధించలేమన్న విషయాన్ని తిరుపతి ఉప ఎన్నికల ద్వారా జనసేన గుర్తించిందని టీడీపీ భావించింది. మరోసారి బద్వేలు ఉప ఎన్నికల్లోనూ జనసేన, బీజేపీ కూటమి ఓటు బ్యాంకును భారీగా గండి కొట్టి జనసేనను తమ వైపుకు తిప్పుకోవాలని రాజశేఖర్ ను పార్టీ అభ్యర్థిగా తొలుత చంద్రబాబు ప్రకటించారు. బద్వేలు ఉప ఎన్నిక జనరల్ ఎన్నికలకు ముందు రాజకీయ సమీకరణాలను మార్చివేస్తాయని టీడీపీ బలంగా విశ్వసిస్తుంది. అందుకే ఇప్పుడు బద్వేలు పోటీ నుంచి తప్పుకుంది. కానీ తనను పిలిపించుకుని బలవంతంగా పోటీకి ఒప్పించారని, కొద్ది రోజులుగా తాను ప్రచారం చేసుకుంటున్నానని, ఖర్చు కూడా అయిందని అభ్యర్థి రాజశేఖర్ చెబుతున్నారు. పొలిట్ బ్యూరో సమావేశం పెట్టి హడావిడి నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. ఇలాగైతే టీడీపీ క్యాడర్ ఏం కావాలని? ఇప్పుడు ఓట్లు ఎవరికి వేయాలో మీరే చెప్పండని అచ్చెన్నాయుడుకు ఫోన్ చేసి నిలదీసినట్లు సమాచారం. మొత్తం మీద బద్వేల్ బరి నుంచి తప్పుకోవడం అక్కడి పార్టీనేతలు, క్యాడర్ లో అసంతృప్తిని రగిలించింది.

## హెటిరో దాడులు వెనుక..?

విశాఖపట్టణం,అక్టోబరు 9, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ రాజకీయం స్టార్ట్ చేసిందా? ఎన్నికలకు ముందు ప్రతి రాష్ట్రంలో అమలు చేసే ఫార్ములాను ఏపీలోనూ అమలు చేస్తుందా? అంటే అవుననే అనుమానాలు వస్తున్నాయి. వరసగా జగన్ సన్నిహితులపై ఆదాయపు పన్ను శాఖ దాడులు జరుగుతుండటం ఇందుకు అద్దం పడుతుంది. జగన్ కు అత్యంత సన్నిహితులైన వారిని ఆర్థికంగా ఇబ్బందులు పెట్టడానికే ఈ దాడులు జరుగుతున్నాయని పొలిటికల్ సర్కిళ్లలో టాక్ నడుస్తుంది. నిన్నగాక మొన్న వైసీపీ రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డికి చెందిన రాంకీ సంస్థలపై ఐటీ దాడులు జరిగాయి. ఈ దాడులతో వైసీపీ నేతలను కూడా వదిలిపెట్టబోమని బీజేపీ పరోక్షంగా సంకేతాలను పంపింది. దాదాపు రెండు రోజుల పాటు జరిగిన రాంకీ సంస్థలపై జరిగిన దాడుల్లో ఆదాయపుపన్ను శాఖ అధికారులు అనేక లోపాలు ఉన్నట్లు గుర్తించారు. భారీగా జరిమానా కూడా విధించే అవకాశముందని చెబుతున్నారు. తాజాగా రెండు రోజుల నుంచి జగన్ కు అత్యంత సన్నిహితుడైన పారిశ్రామిక వేత్త పార్థసారధి రెడ్డికి చెందిన హెటిరో సంస్థపై ఆదాయపు పన్ను శాఖ దాడులు జరుగుతున్నాయి. ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో పెద్దయెత్తున నగదు దొరికిందని వార్తలు వస్తున్నాయి. దాదాపు ఇరవై బృందాలు ఈ దాడులు నిర్వహించాయి. పార్థసారధి రెడ్డి వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ముద్రపడ్డారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డితో మంచి సంబంధాలున్నాయి. పార్థసారధి రెడ్డికి చెందిన హెటిరో సంస్థకు విశాఖలోనూ జగన్ ప్రభుత్వం ఇటీవలే స్థలాన్ని కేటాయించింది. టీటీడీలో సభ్యుడిగా కూడా నియమించింది. అత్యంత ధనవంతుడిగా పేరున్న పార్థసారధి రెడ్డి వైసీపీకి ఎన్నికల సమయంలో పెద్దయెత్తున ఆర్థిక సాయం అందిస్తారన్న పేరుకూడా ఉంది. దీంతో బీజేపీ జగన్ ప్రభుత్వాన్ని ఎన్నికలకు మూడేళ్ల ముందు నుంచే టార్గెట్ చేసినట్లు కనిపిస్తుందంటున్నారు. జగన్ సన్నిహితులు మరికొందరిపై ఐటీ దాడులు జరిగే అవకాశముందని అంటున్నారు. హెటిరో డ్రగ్స్ సంస్థల్లో జరుగుతున్న ఐటీ సోదాల్లో వందల కోట్ల నగదు బయట పడడంతో అధికారులే నోరు వెల్లబెడుతున్నారు.. ఐటీ దాడులులో అక్రమాలు వెలుగు చూడడంతో పాట గుట్టల కొద్ద డబ్బులు దర్శనమిస్తున్నాయి.. మూడు రోజులుగా హెటిరో డ్రగ్స్‌లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతుండగా.. రెండో రోజే రూ. 100 కోట్లకు పైగా నగదు సీజ్ చేశారనే వార్తలు వచ్చాయి.. కానీ, ఇవాళ ఆ మొత్తం ఏకంగా రూ. 200 కోట్లకు చేరినట్టుగా తెలుస్తోంది.. మూడ్రోజులుగా హెటిరో డ్రగ్స్‌లో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి.. హెటిరో డ్రగ్స్ కార్యాలయంతో పాటు 22 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు అధికారులు.. ఈ సోదాల్లో ఇప్పటివరకు రూ. 200 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాల్లో భాగంగా.. బోరబండలోని ఓ ఫ్లాట్ నుంచి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు అధికారులు.. ఆ క్యాష్‌ను ఏకంగా నాలుగు వాహనాల్లో కోఠిలోని బ్యాంక్‌కు తరలించినట్టుగా తెలుస్తోంది.. హెటిరో ప్రధాన కార్యాలయంతో పాటు అధికారుల ఇళ్లలోనూ క్యాష్ దొరికినట్టుగా సమాచారం.. ఆ నగదుపై సరైన ఆధారాలు చూపెట్టక పోవడంతో ఆ మొత్తాన్ని సీజ్ చేశారు అధికారులు.. మొత్తంగా రూ. 200 కోట్ల నగదుతో పాటు భారీ మొత్తంలో ఇన్‌వాయిస్‌లు స్వాధీనం చేసుకున్నట్టుగా తెలుస్తోంది.

## తాడికిండలో తమ్ముళ్లలో లుకలుకలు

గుంటూరు, అక్టోబరు 9, (న్యూస్ పల్స్) మాజీ ఎమ్మెల్యే.. టీడీపీ కీలకంగా భావించే ప్రాంతానికి చెందిన నాయకుడు. నియోజకవర్గానికి పార్టీ ఇంఛార్జ్ కూడా. ఆయనకు తెలియకుండానే అక్కడ కొందరికి పార్టీ పదవులు ఇచ్చేశారు. పార్టీ ఆయన్ని పట్టించుకోవడం లేదా? సైడ్ చేసిందా? లైట్ తీసుకుంటుందా? ఎవరా నాయకుడు? ఏంటా ప్రాంతం?శ్రావణ్ కుమార్. టీడీపీ మాజీ ఎమ్మెల్యే. రాజధాని అమరావతిలోని కీలక నియోజకవర్గమైన తాడికొండలో 2014లో టీడీపీ నుంచి గెలిచారు. గత ప్రభుత్వం అమరావతికి ప్రాధాన్యం ఇవ్వడంతో అక్కడ కీలకంగా మారారు శ్రావణ్ కుమార్. రాజధానిని ప్రకటించడంతో అమరావతి ప్రాంతంలో టీడీపీకి తిరుగే ఉండబోదని లెక్కలేసుకున్నారు పార్టీ నాయకులు. 2019 ఎన్నికలకు వచ్చేసరికి టీడీపీ ఈక్వేషన్స్ మారిపోయాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు తాడికొండ టికెట్ నిరాకరించింది పార్టీ. దీంతో స్థానిక నేతలు చంద్రబాబు దగ్గర పట్టుబట్టి శ్రావణ్‌కు టికెట్ ఇప్పించుకున్నా ఓటమి తప్పలేదు. ప్రస్తుతం తాడికొండ టీడీపీ ఇంఛార్జ్‌తోపాటు గుంటూరు పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడిగానూ ఆయనే కొనసాగుతున్నారు. అయినప్పటికీ శ్రావణ్ కుమార్‌కు తెలియకుండానే కొందరు స్థానికులకు టీడీపీలో పదవులు కట్టబెట్టడం రచ్చ రచ్చ అవుతోంది. పార్టీలో ఎవరికి పదవులు ఇవ్వాలో నియోజకవర్గ ఇంఛార్జులు సూచిస్తారు. లేదా అధిష్ఠానమే ఫలానా వారికి పార్టీ పదవి ఇవ్వాలని భావిస్తే.. అక్కడి ఇంఛార్జ్‌కు చెబుతుంది. కానీ.. తుళ్లూరు మండలానికి చెందిన ఓ మహిళా నేతను తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్టు ఇంఛార్జ్ శ్రావణ్‌కుమార్‌కు తెలియదట. దీంతో ఈ మాజీ ఎమ్మెల్యేకు టీడీపీ పెద్దలు ఎందుకు చెప్పలేదు? 2019లో టికెట్ ఇచ్చే సమయంలో చెడినట్టే.. ఇప్పుడు కూడా గ్యాప్ వచ్చిందా? మాజీ ఎమ్మెల్యేను పట్టించుకోనక్కర్లేదని టీడీపీ భావిస్తోందా? ఆయనకు చెప్పకపోయినా ఫర్వాలేదని అనుకుందా? లేక శ్రావణ్‌కుమార్‌ను లైట్ తీసుకుందా? ప్రస్తుతం ఈ ప్రశ్నలే పార్టీలో చర్చగా మారాయి. సదరు మహిళకు పార్టీ పదవి ఇవ్వడంపై ఇంఛార్జ్ శ్రావణ్‌కుమార్‌కు కూడా అభ్యంతరాలు ఉన్నాయట. ఆయన కూడా టీడీపీ పెద్దల నిర్ణయంపై అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఒక్క శ్రావణ్ కుమారే కాదు.. తుళ్లూరు మండలానికి టీడీపీ కేడర్ కూడా భగ్గుమంది. ఓపెన్‌గానే తమ అసంతృప్తిని బయటపెట్టారు. టీడీపీ అధిష్ఠానం తమను కించపరించిందని స్థానిక పార్టీ నేతలు.. తమ పదవులకు రాజీనామా చేసి కలకలం రేపారు. అమరావతి జేఏసీ ప్రతినిధులు సైతం అభ్యంతరాలు తెలిపారు. టీడీపీలోని దళిత సంఘాలు భగ్గుమన్నాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రులుగా, ఎంపీలుగా పదవులు అనుభించిన చాలా మంది.. ఓడిన తర్వాత పత్తా లేకుండాపోయారు. మాజీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాత్రం తాడికొండలో పార్టీని అంటిపెట్టుకునే ఉన్నారు. అయినప్పటికీ పార్టీ పదవుల పంపకంలో శ్రావణ్ అభిప్రాయం ఎందుకు తీసుకోలేదు? ఆయన్ని అడిగి పదవులు ఇవ్వాల్సిన అవసరం లేదని పార్టీ భావించిందా? అలాంటి అవసరం లేదనుకుందా? మొత్తానికి ఒక పదవి.. టీడీపీ కీలకంగా భావిస్తున్న ప్రాంతంలో పెద్ద చిచ్చే పెట్టింది. మాజీ ఎమ్మెల్యేపై మరోసారి చర్చా మొదలైంది. మరి.. ఈ సమస్య ముదురు పాకాన పడకుండా పార్టీ అధినాయకత్వం ఏ చేస్తుందో చూడాలి.

## విశాఖ ఆ ఆరుగురిలో సర్వే టెన్షన్

విశాఖపట్టణం, అక్టోబరు 9, (న్యూస్ పల్స్)విశాఖ వైసీపీలో అంతర్గత సర్వే టెన్షన్ పుట్టిస్తోందా? ఎమ్మెల్యేల పనితీరుకు హైకమాండ్ గీటురాయి పెట్టిందా? ఈ నివేదికలు కొందరు శాసనసభ్యుల భవిష్యత్‌ను నిర్దేశిస్తాయా? నెగెటివ్ స్కోర్ ఉన్న ఎమ్మెల్యేలు ఎవరు? పార్టీ నేతలు ఆరా తీస్తున్నారా2019 ఎన్నికల్లో తెలుగుదేశం కంచుకోటలను బద్ధలు కొట్టింది వైసీపీ. ఉత్తరాంధ్ర రాజకీయాలకు గేట్ వేగా పిలుచుకునే విశాఖజిల్లాలో 11 అసెంబ్లీ సీట్లు.. మూడు ఎంపీ స్థానాలను కైవశం చేసుకుంది. అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలో నియోజకవర్గాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించేందుకు ప్రత్యేక వ్యవస్థ నడుస్తోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు.. ప్రభుత్వ విధానాలపై ప్రజాభిప్రాయాన్ని వివిధ మార్గాల ద్వారా సేకరిస్తోంది. ఐతే, ఇప్పుడు నిర్వహిస్తున్న అంతర్గత సర్వే పూర్తిగా భిన్నమైందనే చర్చ అధికారపార్టీలో ఆసక్తికరంగా మారిందిరెండున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీని, నాయకత్వాన్ని సిద్ధం చేస్తోంది వైసీపీ హైకమాండ్. ఇటీవల కొన్ని సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించాయట. లేటెస్ట్‌గా ప్రశాంత్ కిశోర్ టీమ్ విశాఖలో సర్వే ప్రారంభించినట్టు ప్రచారం జరుగుతోంది. పీకే బృందం సేకరిస్తున్న అంశాలేంటనేది పార్టీలో చర్చగా మారింది. జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేల పనితీరు, స్థానిక పరిస్థితులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారట. పార్టీ తరపున నిర్వహిస్తున్న సర్వేలో చాలా జాగ్రత్తలు పాటిస్తున్నారట. పాదయాత్ర కంటే ముందు నుంచి పార్టీలో సభ్యత్వం కలిగిన కేడర్, లీడర్ల నుంచి మాత్రమే ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. వారిచ్చే సమాచారమే పక్కా అనే అభిప్రాయం ఉందట. ఇటీవల కొందరు వైసీపీ నేతలు తమ అభిప్రాయాలను బాహాటంగానే వెల్లడిస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవ చేస్తున్నవారికి నామినేటెడ్ పదవుల భర్తీలో అన్యాయం జరిగిందనే చర్చ ఉంది. ఇక యంత్రంగం తమ మాటకు విలువివ్వడం లేదని కొందరు ఎమ్మెల్యేలలో అసంతృప్తి ఉంది. చిన్నపాటి పనులు కూడా చేయించుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారట. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు పార్టీ ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. ఎమ్మెల్యేల పనితీరు.. నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టత.. అంతర్గత వ్యవహారాల ఆధారంగా సర్వే నిర్వహిస్తున్నారట. దీంతో నెగెటివ్ స్కోర్ వచ్చే ఎమ్మెల్యేలు ఎవరన్నది ఆసక్తిగా మారింది. ఆ జాబితాలో ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ ఆరుగురిలో ఒకరు సీనియర్ ఎమ్మెల్యే కాగా.. మిగలిన వారు ఫస్ట్ టైమ్ శాసన సభ్యులుగా చెబుతున్నారు. గ్రేటర్ విశాఖ పరిధిలో రెండు, గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో నాలుగుచోట్ల ప్రతికూల వాతావరణం ఉందని చర్చ నడుస్తోంది. ఎన్నికల ఫలితాలు, అంతర్గత విభేదాలు కొందరు ఎమ్మెల్యేలకు నెగెటివ్ స్కోర్ మూటగట్టాయనేది ఓ వాదన. అధికారికంగా చెప్పకపోయినా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం రెఫరెండంగానే భావించిందట. జిల్లాలోని మెజార్టీ ఎమ్మెల్యేలు ఈ పరీక్షలో నెగ్గినప్పటికీ.. కొందరికి ఇబ్బందికర పరిస్థితులు ఎదరయ్యాయి. సీట్లు పెరగకపోయినా ప్రతిపక్షానికి ఓట్లు పెరగడం వైసీపీని ఆలోచనలోపడేసిందట. అందుకే దిద్దుబాటు చర్యల కోసం సర్వే చేయిస్తున్నట్టు సమాచారం.

## కలివిడిగా కమలం, జనసేన

నెల్లూరు, అక్టోబరు 9, (న్యూస్ పల్స్)భారతీయ జనతా పార్టీ, జనసేనల మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్లుంది. రెండు పార్టీలూ విడివిడిగానే తమ కార్యక్రమాలను చేపడుతుండటం దీనికి సంకేతాలని చెప్పాలి. ఒకరిపై ఒకరికి నమ్మకం లేదు. అయితే ఇప్పుడిప్పుడే బయటపడే




అవకాశం లేదు. కానీ సమయం కోసం ఇద్దరూ వెయిట్ చేస్తున్నట్లే కన్పిస్తుంది. పొత్తు ధర్మాన్ని పాటించడం లేదని ఇద్దరూ అభిప్రాయపడుతుండటమే ఇందుకు ప్రధాన కారణంగా చూడాలి. పరిషత్ ఎన్నికల్లో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన టీడీపీతో పొత్తు పెట్టుకుంది. వైసీపీని అధికారంలోకి రానివ్వకుండా ఉండేందుకే ఈ పొత్తు పెట్టుకున్నామని చెబుతున్నా, అదే జిల్లాకు చెందిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి తెలియకుండానే పొత్తులు కుదిరిపోయాయి. దీనిపై జనసేన అధినాయకత్వం మాత్రం తమతో సంప్రదించకుండానే స్థానిక నాయకత్వం నిర్ణయం తీసుకుందని చెప్పి తప్పించుకుంటోంది. ఇక కార్యక్రమాలు కూడా విడివిడిగానే చేస్తున్నాయి. పొత్తు కుదిరిన తొలినాళ్లలో రెండు పార్టీలు కలసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసేవి. అయితే ఈ మధ్యకాలంలో మాత్రం ఎవరి దారి వారిదే అన్నట్లు వ్యవహారం సాగుతుంది. జనసేన ఈ నెల 2వ తేదీన రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. బీజేపీ తో చర్చించకుండానే ఈ కార్యక్రమాన్ని జనసేన ప్రకటించింది. ఇది కూడా బీజేపీలో అసంతృప్తికి ఒక కారణమంటున్నారు. దీంతో బీజేపీ కూడా తక్కువ తినలేదు. తమ కార్యక్రమాలను తాము చేసుకుంటున్నారు. ఈనెల 7వ తేదీన మత్స్య గర్జన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అది కూడా సొంతంగా నిర్వహించుకున్నారు. జనసేనతో కలసి నడిచే కన్నా సొంతంగానే బలపడటం బెటర్ అన్న ధోరణిలో బీజేపీ నాయకత్వం కూడా ఉంది. మొత్తం మీద జనసేనను బీజేపీ అనుమానం గా చూస్తుంది. అదే సమయంలో బీజేపీని జనసేన దూరం పెట్టాలని యోచిస్తుంది. ఇప్పటికిప్పుడు కాకున్నా ఎన్నికలు దగ్గరపడిన సమయంలో రెండు పార్టీల మధ్య కటీఫ్ తప్పదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

## మాకు టిక్కెట్టు కావాలి....

విజయవాడ, అక్టోబరు 9, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ లో పవన్ కల్యాణ్ ప్రభావం కన్పిస్తుందా? ప్రధానంగా జనసేనతో పొత్తు కుదుర్చుకుంటే తమ భవిష?యత్ ఏంటన్న బెంగ నేతలకు ఇప్పటి నుంచే పట్టుకుందా? అవును. ఇటీవల గత కొద్ది రోజులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను టీడీపీ నేతలు కలుస్తున్నారు. తమ ప్రాంతంలో పర్యటించాలని కోరుతున్నారు. దీనికి ప్రధాన కారణం జనసేనతో పొత్తు ఉంటుందనే వార్తలు రావడమే. నారా లోకేష్ వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపులో కీలకంగా మారతారనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆయన ఆశీస్సులుంటేనే టిక్కెట్ అన్న అభిప్రాయం టీడీపీలో బలపడిపోయింది. మొన్నటి ఎన్నికల్లోనే నేతలు లోకేష్ చుట్టూ తిరిగి టిక్కెట్లు సంపాదించుకున్నారు. గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయడంతో టిక్కెట్ల కేటాయింపులో ఎటువంటి సమస్య రాలేదు. తాను అనుకున్న వారికి టిక్కెట్ అప్పగించారు. ఇక ఈసారి అలా కుదరదు. ఖచ్చితంగా టీడీపీ పొత్తులతో వెళ్లి తీరాల్సిందే. అది జనసేనతోనా? కమ్యునిస్టులతోనా? కాంగ్రెస్ తోనా? అన్నది పక్కన పెడితే పొత్తు మాత్రం గ్యారంటీ. దీంతో సీట్ల సంఖ్య తగ్గిపోతుంది. జనసేనతో పొత్తు కుదిరితే దాదాపు నలభై స్థానాలకు పైగానే ఆ పార్టీకి కేటాయించాల్సి ఉంటుంది. ఈ భయమే నారా లోకేష్ వద్దకు నేతలు క్యూ కట్టేలా చేస్తుంది. ప్రధానంగా జనసేనతో పొత్తు కుదిరితే కొన్ని ప్రాంతాల టీడీపీ నేతలకు ఎఫెక్ట్ తప్పదు. ముఖ్యంగా పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు విశాఖ, శ్రీకాకుళం, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, చిత్తూరు వంటి ప్రాంతాల్లో జనసేన టిక్కెట్లను ఎక్కువ కోరే అవకాశముంది. ఇక్కడ మాత్రమే జనసేన కొంత బలంగా ఉండటంతో టీడీపీ కూడా అక్కడే వారికి టిక్కెట్ కేటాయించాల్సి ఉంటుంది. అందువల్లనే ఈ ప్రాంత టీడీపీ నేతల్లో భయం పట్టుకుంది. అందుకే తమ పరిస్థితి ఏంటన్న విషయాన్ని చర్చించేందుకు నారా లోకేష్ ను నేతలు కలుస్తున్నారని చెబుతున్నారు. జిల్లాల పర్యటనలకు ఆయనను ఆహ్వానిస్తున్నారు.

## గుడివాడ లో వంగవీటి పోటీ

విజయవాడ, అక్టోబరు 9, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో ఎప్పటికప్పుడు వ్యూహం మార్చుకుంటూ ఉండాలి. మూస పద్ధతిలో పోతే గట్టెక్కడం కష్టమే. ప్రధానంగా బలమైన నాయకులు ఉన్నప్పుడు స్ట్రాటజీ మారుస్తుండాలి. ఇప్పుడు గుడివాడ నియోజకవర్గంలో టీడీపీ గట్టెక్కడానికి అన్ని రకాలుగా చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఈసారి కొడాలి నాని ఎలాగైనా ఓడించాలన్న కసితో ఉన్నారు. అందుకే సామాజికవర్గాలను బేరీజు వేసుకుని ఈసారి గుడివాడ కాండిడేట్ ఎంపిక ఉండనుంది. గుడివాడ నియోజకవర్గంలో తొలి నుంచి కమ్మ సామాజికవర్గం నేతలే ఎన్నికవుతూ వస్తున్నారు. 1983లో పార్టీ పెట్టినప్పుడు ఎన్టీఆర్ గుడివాడ నుంచి ఎన్నికయ్యారు. తర్వాత రావి శోభనాద్రీశ్వరి ఎన్నికయ్యారు. అక్కడి నుంచి మొన్నటి కొడాలి నాని వరకూ అందరూ కమ్మ సామాజికవర్గం నేతలే గుడివాడ నుంచి ఎన్నికవుతూ వస్తున్నారు. మధ్యలో కాంగ్రెస్ అభ్యర్థిగా కఠారి ఈశ్వరకుమార్ పోటీ చేసి కమ్మ సామాజికవర్గేతర ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. గుడివాడలో ఇప్పటి వరకూ కమ్మ సామాజికవర్గం నేతకే టీడీపీ టిక్కెట్ ఇస్తూ వస్తుంది. గత ఎన్నికల్లోనూ కొడాలి నాని పై విజయవాడ నుంచి దేవినేని అవినాష్ ను బరిలోకి దింపింది. అయితే ఈసారి రూటు మార్చాలని చంద్రబాబు నిర్ణయించారు. కమ్మ సామాజికవర్గం వైసీపీ పై గుర్రుగా ఉంది. అమరావతి రాజధానిని మార్చడం, కమ్మ సామాజికవర్గం పై కక్ష సాధింపులు వంటివి ఆ వర్గం తమకు ఎటూ అండగా ఉంటుంది. అందుకే ఈసారి గుడివాడలో కమ్మ సామాజికవర్గం నేత కాకుండా ఇతర కులాల నుంచి అభ్యర్థిని టీడీపీ బరిలోకి దింపే అవకాశముంది. ఇందులో వంగవీటి రాధా పేరు ప్రముఖంగా విన్పిస్తుంది. వంగవీటి రాధాను గుడివాడలో బరిలోకి దింపితే చుట్టుపక్కల మచిలీపట్నం, పెడన నియోజకవర్గాలపై కూడా ప్రభావం ఉంటుందని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అందుకే ఈసారి గుడివాడలో కమ్మేతర నేతను చంద్రబాబు బరిలోకి దింపనున్నట్లు టాక్.

## అల్లుడిపై దాడి చేసిన మామ

పిడుగురాళ్ళ గుంటూరు జిల్లా పిడుగురాళ్ళ మండలం తుమ్మలచెరువు గ్రామంలో అల్లుడిపై మామ,బావమరిదిలు వేటకొడవలితో దాడిచేసారు. దైద గ్రామానికి చెందిన దూదేకుల చిన్న ఖాసీం పదేళ్ళ క్రితం పెళ్ళి చేసుకొని తుమ్మలచెరువులోని అత్తారింటికి ఇళ్ళరికం వచ్చిన నాటి నుండి చెడువ్యసనాలకు బానిసై భార్యను వేధిస్తుంటాడని ఎన్నిసార్లు సర్ది చెప్పినా తీరు మార్చుకోని ఖాసీం మరలా గతరాత్రి పూటుగా తాగి భార్యపై గొడవకు దిగటంతో మామ పీరుసాహెబ్,బావమరిది శీనుభాషాలు ఎదురు దాడికి దిగి కొడవలితో నరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రక్తస్రావం అవుతున్న ఖాసీంను ప్రవేట్ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు గ్రామీణ యస్.ఐ విజయ్ చరణ్ తెలిపారు.

# ఈసారి బాబు డబుల్ సీట్లు...

తిరుపతి, అక్టోబరు 9, (న్యూస్ పల్స్)టీడీపీ అధినేత చంద్రబాబు చూడని రాజకీయం.. చూడని ఎత్తుపల్లాలు లేవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఎక్కువ కాలం పని చేసిన ఘనత చంద్రబాబుకు ఉంది. అలాగే రాష్ట్ర విభజన తర్వాత కూడా నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు కొత్త రికార్డు సృష్టించారు. అలాంటి చంద్రబాబు తన రాజకీయం జీవితంలో ఎన్నడూ లేనివిధంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కనీసం సొంత నియోజకవర్గంలోనూ పార్టీని గాడినపెట్టలేని పరిస్థితిలో చంద్రబాబు ఉన్నారా? అంటే అవుననే సమాధానమే విన్పిస్తుంది. దీంతో మున్ముందు టీడీపీ భవిష్యత్ ఏంటా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. ఐదేళ్లు అధికారం అనుభవించిన తర్వాత ఆయన ఎన్నికలకు వెళ్లారు. అయితే ఆ ఎన్నికల్లో టీడీపీకి దారుణమైన ఫలితాలు వచ్చాయి. ఏపీలోని 175 అసెంబ్లీ స్థానాలకు గాను టీడీపీకి కేవలం 23సీట్లే దక్కాయి. దీంతో అధికారానికి దూరమైంది. ఇక జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక టీడీపీ క్రమంగా బలహీనమవుతూ వస్తోంది. టీడీపీ నుంచి గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు జగన్ కు జై కొట్టారు. దీంతో ఆ పార్టీలో ఇప్పుడెంత మంది ఉన్నారనేది అర్థం కావడం లేదు.జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఇప్పటికే రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్నారు. ఆయన పాలనపై ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత కన్పించడం లేదు. రాష్ట్రంలోని ప్రతీఒక్కరూ ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నారు. దీంతో ప్రజలు ఆయన వెంటే నడుస్తున్నట్లు కన్పిస్తుంది. గత స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమైపోతుంది. చంద్రబాబు సొంత నియోజకవర్గంలోనూ వైసీపీ జెండానే ఎగిరింది. ఈ పరిస్థితులను బేరీజు వేసుకున్న చంద్రబాబు తాజాగా దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.కుప్పం నియోజకవర్గం తొలి నుంచి టీడీపీ కంచుకోట. ఇక్కడి నుంచి చంద్రబాబు వరుసగా గెలుస్తూ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రాణిస్తున్నారు. టీడీపీ అధికారంలో లేకపోయినా పార్టీ బలంగా ఇక్కడ ఉండేది. అలాంటి కంచుకోటకు జగన్ సర్కారు హయాంలో బీటలు వారుతున్నాయి. కిందటి స్థానిక సంస్థల్లో వైసీపీ కుప్పంలో అత్యధిక స్థానాలు దక్కించుకోగా టీడీపీ కనీస పోటీ ఇవ్వలేకపోవడం ఇందుకు నిదర్శంగా కన్పిస్తుంది. దీంతో కుప్పంపై చంద్రబాబు ఆశలు వదులుకోవాల్సిందేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రాబోయే ఎన్నికల్లో కుప్పం నుంచి చంద్రబాబు తనయుడు నారా లోకేష్ పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే చిన్నబాబు ఇక్కడ నుంచి పోటీ చేస్తే అసలుకే మోసం వస్తుందని చంద్రబాబు భావిస్తున్నారు. దీంతో ఆయనే కుప్పం నుంచి మరోసారి పోటీ చేస్తారనే టాక్ విన్పిస్తుంది. ఇదిలా ఉంటే చంద్రబాబు ఉత్తరాంధ్ర నుంచి పోటీ చేస్తే ఆ ప్రాంతంలో పార్టీ మళ్లీ పుంజుకుంటుందని సీనియర్ నేతలు సూచిస్తున్నారు. అయితే దీనిపై చంద్రబాబు ఏటూ తేల్చుకోలేకపోతున్నారట.కుప్పం తొలి నుంచి చంద్రబాబుకు సెంటిమెంట్ గా కలిసి వచ్చింది. ఈనేపథ్యంలో ఆయన ఎట్టి పరిస్థితుల్లో ఈ స్థానాన్ని వదులుకునే ప్రసక్తి లేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే చంద్రబాబు కుప్పంలో గ్రామస్థాయి నుంచి ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు విశాఖ నుంచి చంద్రబాబు పోటీ చేస్తే బాగుంటుందని సీనియర్లు కోరుతున్నారు. దీంతో చంద్రబాబు రెండుచోట్ల నుంచే పోటీ చేస్తారనే ప్రచారం సైతం పార్టీలో జోరుగా నడుస్తోంది.అయితే చంద్రబాబు డబుల్ గేమ్ ఆడుతారా? లేదంటే సింగిల్ సీటుపైనే పోటీ చేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి గత అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్నటి ఎంపీటీసీ ఫలితాల వరకు చూస్తే టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా బలహీనం అవుతుందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా కుప్పంపై టీడీపీ క్రమంగా పట్టు కోల్పోతున్నట్లే కన్పిస్తుంది. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు పార్టీని తిరిగి ఎలా గాడిన పెడుతారనేది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

## శ్రీశైల దేవస్థానం అభివృద్ధి పనులను పరిశీలించిన దేవాదాయ కమిషనర్

శ్రీశైలంఅక్టోబరు 9, (న్యూస్ పల్స్ శ్రీశైల దేవస్థానం, శ్రీశైలంఅభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించినదేవదాయశాఖ కమిషనర్రాష్ట్రదేవదాయకమిషనర్ డా. ఎం.హరిజవహర్లాల్ ఈ రోజు దేవస్థానం. పరిపాలనా భవనములో అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. ఈసమావేశములో అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు. సంబంధిత సిబ్బంది.పాల్గొన్నారు.ముందుగా సమావేశములో కార్యనిర్వహణాధికారివారు దేవస్థానములో చేపట్టబడిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనుల ప్రణాళిక, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు మొదలైన అంశాల గురించి కమిషనర్ వారికి వివరించారు.ప్రసాద్ పథకం క్రింద చేపట్టబడిన వివిధ పనులు, గణేశ సదనం నిర్మాణం, నక్షత్రవనం అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు మొదలైన అంశాలను గురించి వివరించారు. తరువాత సమీప భవిష్యత్తులో ప్రారంభించేందుకు తలపెట్టిన ఆలయమాడవీధుల అభివృద్ధి పనులు, క్యూకాంప్లెక్స్ నిర్మాణం, డార్మీటరీల నిర్మాణం, మ్యూజియం నిర్మాణం మొదలైన అంశాలను వివరించారు.తరువాత దేవదాయశాఖ కమిషనర్ వారు దసరా మహోత్సవాలలో ఏర్పాట్లను గురించి సమీక్షించారు. ఉత్సవాలలో స్వామి అమ్మవార్లకు జరిపే పూజాదికాలు, భక్తులకు ఏర్పాట్లు మొదలైన వాటి గురించి చర్చించారు.అనంతరం కమిషనర్ వారు మాట్లాడుతూ శ్రీస్వామి అమ్మవార్లకు జరిపించాల్సిన కైంకర్యాలు, భక్తుల సౌకర్యాల కల్పన, క్షేత్రాభివృద్ధి తదితర అంశాలపై పలు ఆదేశాలు ఇచ్చారు.ముఖ్యంగా శ్రీస్వామి అమ్మవార్లకు, ఉపాలయాలలో దేవతామూర్తులకు, ఆయా పూజాదికాలను, సమయానుసారంగా సమర్పించాల్సిన నివేదనలను ఆగమశాస్త్రానుసారంగా మరియు పరిపూర్ణంగా జరిపించాలని ఆదేశించారు.ఇంకా వారు మాట్లాడుతూ భక్తులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలన్నారు. క్షేత్రానికి విచ్చేసే ప్రతి భక్తుడు సంపూర్ణంగా తనయాత్ర ఫలవంతమైందనే తృప్తి కల్పించాల్సిన బాధ్యత దేవస్థానంపై ఉందన్నారు. భక్తుల మనోభావాలను, వారి విశ్వాసాలను గౌరవిస్తుండాలన్నారు. భక్తులు ఆనందంగా ఉన్నప్పుడే భగవంతునికి ఆనందం కలుగుతుందని, ఈ విషయాన్ని ఆలయ ఉద్యోగులందరు కూడా గుర్తుంచుకోవాలన్నారు.తరువాత దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదానం, గో సంరక్షణ, పరిపాలన, ఆడిట్, అకౌంట్స్, సాయ ఇంజనీరింగ్, వైద్యశాల నిర్వహణ, పారిశుద్ధ్యం మొదలైన అంశాలను సమీక్షించారు.ఇంకా వారు దేవస్థానంలో ప్రతి ఉద్యోగి కూడా నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు.ప్రతి ఉద్యోగి కూడా తన విధుల పట్ల భక్తి, గౌరవాలను కలిగివుండాలన్నారు.ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ జవాబుదారితనాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ విషయమై ప్రతి ఉద్యోగి కూడా స్వీయ క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. పాలనాసంబంధి అంశాలలో పూర్తి పారదర్శకత ఉండాలన్నారు.

## అద్భుతమైన కళాకృతులతో నిర్మితమవుతున్న అరుదైన పంచముఖ ఆంజనేయ ఆలయం

విజయవాడ అక్టోబరు 9, (న్యూస్ పల్స్)కృష్ణాజిల్లా ముసునూరు మండలం తాళ్లవల్లి గ్రామ పచ్చని పొలాల నడుమ త్వరలో ఐదున్నర అడుగుల ఎత్తులో శ్రీ హనుమత్ క్షేత్రం దర్శనమివ్వనుంది. నూజివీడుకు 13కిలోమీటర్ల దూరంలో జంగన్నగూడెం పంచాయతీలో 15గ్రామాల మధ్య భాగన పూలు పండ్ల తోటల ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వామివారు కొలువుదీరనున్నారు. సుమారు 2ఎకరాల విస్తీర్ణంలో వైకానస శాస్త్ర ప్రకారం ఆలయ నిర్మాణం,భక్తులకు నిత్యఅన్నదాన సత్రం,వసతి గదుల నిర్మాణ ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. వైశాఖ మాసంలో ఆలయ ప్రారంభోత్సవం గావించి,స్వామి వారికి నిత్య సేవలు,మాస, పక్ష,సంవత్సర ఉత్సవాలు నిర్వహిస్తామనీ ఆలయ స్థల,నిర్మాణ వ్యవస్థాపకులు వేదానీ తం.వెంకట అనంత రామశాస్త్రులు తెలిపారు. తూర్పున ఆంజనేయుడు, దక్షిణాన లక్ష్మి నరసింహుడు, పడమర గరుక్ మంతుడు, ఉత్తరనా వరాహస్వామి, హైగ్రీవాస్వామి ల రూపంతో దర్శనమివ్వనున్నారు. ఏ ప్రాంతంలోనైనా చాలా చోట్ల పంచముఖ రూపంలో స్వామి వారి విగ్రహాలు మాత్రమే ఉండగా, పంచముఖ ఆంజనేయుల వారికి దేవాలయం నిర్మించి పూజలు అందుకునే అరుదైన ఆలయం ఆంధ్రప్రదేశ్ లో ఇదే తొలి గుడిగా పేర్కొన్నారు. శ్రీమాన్ వేదాంతం.కేశవ చార్యుల వారు పూర్వం 15 గ్రామాల ప్రజలకు నిత్యం సైకిల్ పై తిరుగుతూ ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తూ మన్ననలు పొందారు. ఓ రోజున మార్గమధ్యంలో ఒక బాటసారి అనారోగ్య బారిన పడగా అతనికి వైద్యం అందించి తిరిగి వెళు తున్న వైద్యుని కేశవచార్యుని చేతిలో పంచలోహ పంచముఖ ఆంజనేయుల వారి ప్రతిమను ఇచ్చి నిత్యం పూజలు చేస్తే శుభం కలుగుతుందని తెలిపి ఒక అజ్ఞాత రోగి వెళ్లిపోయింది. నాటి నుండి తరతరాలుగా స్వామి వారికి భక్తి శ్రద్ధలతో వేదాంతం కుటుంబీకులు పూజలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్యుడు కేశవ చార్యుల వారి కోరిక మేరకు పంచముఖ స్వామి వారి విగ్రహానీకు ఆలయం నిర్మించి నిత్య పూజలతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని స్థలం కొనుగోలు చేసి ఆలయ నిర్మాణంకు కేశవచార్యుల వారి వంశీకులు పూనుకున్నారు.

## పోలీస్ వెల్ఫేర్ డే సందర్భంగా సిబ్బందికి హెల్మెట్ పంపిణీ

నందిగామ అక్టోబరు 9, (న్యూస్ పల్స్ స్థానిక నందిగామ రూరల్ సర్కిల్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే సందర్భంగా నందిగామ డిఎస్పీ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పోలీస్ సిబ్బందికి హెల్మెట్ లను అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నందిగామ రూరల్ సర్కిల్ పరిధిలోని కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు వందమందికి హెల్మెట్ ల ను అందజేయడం జరిగిందని విధి నిర్వహణలో భాగంగా కుటుంబ స్థానిక పరిస్థితుల దృష్ట్యా వేరు వేరు చోట్ల ప్రయాణాలు చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇటీవల చిలకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం గుర్తు చేశారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు పోలీస్ వెల్ఫేర్ డే సందర్భంగా సిబ్బందికి హెల్మెట్లు అందజేయాలనే మంచి ఆలోచన ఆచరణలో పెట్టిన నందిగామ రూరల్ సిఐ నాగేంద్రకుమార్ ను ఇతర పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకప్పుడు పోలీసు వ్యవస్థ నేటి పోలీస్ వ్యవస్థకు చాలా వ్యత్యాసం ఉందని ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే పదానికి నేటి పోలీసులు సరైన నిర్వచనమని ఆయన కొనియాడారు. కరుణ విలయతాండవం చేస్తున్న సమయంలో కూడా ప్రతి ఒక్కరు విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన విషయాన్ని ఆయన మరొకసారి గుర్తు చేసుకున్నారు. నందిగామ సబ్ డివిజన్ పరిధిలో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సిబ్బందికి హెల్మెట్ ల పంపిణీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వమని ఈ సందర్భంగా ఆయన కోరారు. నేటి ఉరుకుల పరుగుల జీవితం విధానంలో విధి నిర్వహణలో ఒక చోట నుండి మరొక చోటికి ద్విచక్రవాహనాలపై ప్రయాణిసు_న్నప్పుడు డ్రైవింగ్ పైనే ధ్యాస ఉంచాలని ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకునేందుకు హెల్మెట్ ప్రతి ఒక్కరు ధరించాలని ఆయన కోరారు. అనంతరం పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు అందించిన హీరో, హోండా,టీవీఎస్ మ,సుజుకి, బజాజ్ షోరూం సిబ్బందిని దు శాలువాలతో డీఎస్పీ మరియు ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రజిని, ఎంపీపీ మలక్ బషీర్, ఎస్ ఐ లు సుబ్రహ్మణ్యం, ఏసోబు, సోమేశ్వరరావు మహిళా ఎస్సై లక్ష్మి, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# పవన్ మళ్లీ బ్రేక్

విజయవాడ, అక్టోబరు 9, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కల్యాణ్ విషయంలో అనుకున్నట్లే జరుగుతుంది. ఆయన మూడు రోజుల హడావిడి అన్నట్లుగానే రాజకీయానికి ఇంటర్వెల్ ఇచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ ను అంతటా మార్చేస్తానని చెప్పి ఇటు రాజమండ్రి, అటు అనంతపురం జిల్లాలో హల్ చల్ చేసిన పవన్ కల్యాణ్ మళ్లీ స్మాల్ బ్రేక్ ఇచ్చినట్లే కనపడుతుంది. మళ్లీ ఆయన మేకప్ వేసుకున్నారు. దీంతో పవన్ కల్యాణ్ పై ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు ఆయనే అవకాశమిస్తున్నట్లయింది.ఇటీవల ఆంధ్రప్రదేశ్ లో మూడు రోజుల పాటు పర్యటించి పవన్ కల్యాణ్ రచ్చ రచ్చ చేశారు. కులాల ప్రస్తావన తీసుకొచ్చారు. అలాగే ఫిలిం ఇండ్రస్ట్రీలో టిక్కెట్ల ఆన్ లైన్ అమ్మకంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో మూడు రోజుల పాటు పవన్ కల్యాణ్ పతాక శీర్షికల్లో నిలిచారు. వచ్చే ఎన్నికలలో జనసేనదే అధికారమన్నారు. వైసీపీకి 15 సీట్లు కూడా రావని చెప్పి వెళ్లిపోయారు. చూసుకుందాం రా అని సవాల్ విసిరి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు.అందుకే పవన్ కల్యాణ్ ను ప్రజలు కూడా సీరియస్ పొలిటీషయన్ గా చూడటం లేదు. అంతలావున వైసీపీ ప్రభుత్వంపై రంకెలు వేసి, దమ్ముందా? చూసుకుందామా? అని సవాలు విసిరి.. చివరకు బద్వేల్ ఎన్నికలో తాము పోటీ చేయడం లేదని చెప్పి ఆ సీరియస్ గా ఉన్న రాజకీయాలను కామెడీ చే?సేశారు. తుస్సు మనిపించారు. ఇక టీడీపీతో పొత్తు ఉంటుందన్న సంకేతాలు కూడా ఇచ్చి వెళ్లారు.ఇలా ప్రతి ఎన్నికకు పొత్తులను మారుస్తూ వెళుతున్న పవన్ కల్యాణ్ ను ఎవరు నమ్ముతారన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. 2014లో టీడీపీ, బీజేపీకి మద్దతిచ్చారు. 2019 ఎన్నికల్లో ఆ రెండింటికి దూరమై కమ్యునిస్టులతో జత కట్టారు. కమ్యునిస్టులను వదిలేసి ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే బీజేపీతో జట్టుకట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకుంటే జనం హర్షిస్తారా? ఆయన అంటున్న విలువలతో కూడిన రాజకీయాలు ఇవేనా అన్న సందేహం కలుగుతుంది. మొత్తం మీద పవన్ కల్యాణ్ మూడు రోజులు చేసిన రచ్చ ముగిసింది. ఆయన కూడా ప్రశాంతంగా షూటింగ్ లలో మునిగిపోయినట్లుంది.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

తిరుపతి అక్టోబరు 9, (న్యూస్ పల్స్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి తిరుపతి పర్యటన నేపథ్యంలో పకట్బంది భద్రతా ఏర్పాట్లు చేసారు. ఈ నేపథ్యంలో బందోబస్తు అధికారులతో జిల్లా యస్.పి వెంకట అప్పల నాయుడు భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ యస్.పి లు అడ్మిన్ ఇ.సుప్రజ, శాంత్రి భద్రత అరిఫుల్లా , తిరుమల మునిరామయ్య, , ఇంటలిజెన్స్ అధికారులు, డి.యస్.పి లు, సి.ఐ లు, యస్.ఐ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా యస్.పి మాట్లాడుతూ ముఖ్యమంత్రి 11వ తేది తిరుపతి తిరుమల లో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో నిన్నటి దినం తిరుపతి రేణిగుంట విమానాశ్రయం నుండి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ను తిరుమల వరకు సి.యం గారు పర్యటించు ప్రాంతాలలో నిర్వహించడం జరిగింది. రేణిగుంట విమానాశ్రయం నందు కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. అలాగే పర్యటన రహదారుల యందు అవసరమున్న ప్రతి చోట బ్యారికేట్స్, స్టాప్ బోర్డులను ఏర్పాటు చేసున్నాము. భద్రత దృష్ట్యా కార్యక్రమం ప్రాంతాల చుట్టూ రూఫ్ టాప్స్ పై దృష్టి సారించి భద్రతను పెంచుతున్నామన్నారు. అత్యవసర వాహనాలకు మరియు హాస్పిటల్ కు వచ్చు రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగింది. అలాగే తిరుమల యందు యాత్రికులకు, భక్తులకు కూడా ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయడం జరిగింది. ముఖ్యమంత్రి పర్యటించు సమయం లో న్ని ప్రధాన ప్రాంతాల లో కొంత సమయం వరకు ట్రాఫిక్ ను మళ్ళించడం జరుగుతుంది. ప్రజలు దీనికి సహకరించాలని తెలిపారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బందోబస్తును ప్రతిష్టాత్మకంగా తీసుకొని విధులు నిర్వర్తించాలి. ప్రతి బందోబస్తును కొత్తగా చేస్తున్నామనే ఉద్దేశంతో జాగ్రత్తగా నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి. విధుల యందు అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రముఖులకు భద్రత కల్పించడం మన విధి, మన కర్తవ్యంగా భావించి పని చేయాలన్నారు. జిల్లా సరిహద్దు, ప్రధాన రహదారులపై చెక్ పోస్టులను ఏర్పాటు చేసి భద్రతను పెంచుతున్నాము. అలాగే తిరుమల అప్ ఘాట్, డౌన్ ఘాట్ రోడ్డుల యందు బి.డి టీం, డాగ్ స్క్వాడ్, ఆర్.ఓ.పి బృందాలచే విస్తృతంగా అణువణువు తనికీలు చేపట్టి కట్టు దిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నాము. అధికారులు నిరంతరం కార్యక్రమ ప్రదేశాలను పర్యవేక్షిస్తూ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలిస్తూ చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా ఎలాంటి ఇబ్బందికర వాతావరణం చోటు చేసుకోకుండా చూడాలని అధికారులకు సూచనలు చేసారు. మనం చేసే వృత్తి మనకు దైవంగా భావించి విధుల యందు అప్రమత్తంగా ఉండి పర్యటనను విజయవంత చేయాలని ఈ సందర్భంగా జిల్లా యస్.పి వెంకట అప్పల నాయుడు, అధికారులను ఉద్దేశించి భద్రతపై పలు సూచనలు, సలహాలు చేసారు. బందోబస్తు విధుల కొరకు అధికారులు, సిబ్బంది:- అడిషనల్ యస్.పి లు 05, డి.యస్.పి లు 16, సి.ఐ లు 37, యస్.ఐ లు 91, ఏ.యస్.ఐ/హెచ్.సి లు 204, పి.సి లు 467, ఉమెన్ పోలీసులు 56, హోంగార్డ్స్ 118, స్పెషల్ పార్టీ సిబ్బంది 120 మొత్తం 1,114 పోలీస్ అధికారులు మరియు పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసారు.

# టీడీపీ అందోళన

విశాఖపట్నం అక్టోబరు 9, (న్యూస్ పల్స్)అభివృద్ధి పేరుతో విశాఖలోని విలువైన ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ విశాఖలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికి పరిపాలన చేతకాక ఆస్తులను తాకట్టు పెట్టే నీచమైన సంస్కృతికి దిగజారిపోయారని తెదేపా నగర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. సంక్షేమ పథకాలు అమలుకు ఇలా ఆస్థులన్నీ తాకట్టులు పెట్టేసి అమ్ముకుంటూ పోతే... భవిష్యత్తు తరాలకు ఏమి మిగులుస్తారని మండి పడ్డారు. సంపద సృష్టించడం తెలియని అసమర్ధ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇంచార్జ్ లు, రాష్ట్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వం తన తీరు మార్చుకోకపోతే విశాఖ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## ఎర్ర చందనం స్వాధీనం

చిత్తూరు అక్టోబరు 9, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లాలో భారీగా ఎర్రచందనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 50 లక్షల రూపాయల విలువ చేసే ఎర్రచంద నాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మోస్ట్ వాంటెడ్ అంతర్జాతీయ ఎర్ర చందనం స్మగ్లర్ రామనాథ్ రెడ్డి అరెస్టు చేశారు. 62 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## సన్నిధానం, జీఎన్ సి ప్రాంతాలను పరిశీలించిన టిటిడి ఈవో

తిరుమల, అక్టోబరు 09 టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి శనివారం ఉదయం సివిఎస్వో గోపినాథ్ జెట్టితో కలిసి తిరుమలలోని సన్నిధానం, గరుడాద్రి నగర్ కాటేజీల ప్రాంతాలను పరిశీలించారు. అటవీశాఖ విశ్రాంతి గృహం ప్రాంగణం నుండి ప్రారంభించి సన్నిధానం ప్రాంతం, హెచ్ విసి జనరేటర్, జీఎన్ సి కాటేజీలు, గీతా పార్కు, జీఎన్ సి ఉప విచారణ కార్యాలయం తదితర ప్రాంతాల్లో సుమారు రెండు గంటల పాటు తనిఖీలు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. కాటేజీల మధ్యలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి పచ్చదనాన్ని పెంచాలని, తద్వారా అక్కడ చెత్త పోగవకుండా ఉంటుందని అధికారులకు సూచించారు. చెత్త వేయకుండా గదుల్లోని యాత్రికులకు అవగాహన కల్పించాలన్నారు. టీ దుకాణాల వద్ద లైసెన్స్ నిబంధనల మేరకే వస్తువులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాటేజీల వద్ద విరిగిన టైల్స్ ని సరిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గీతా పార్కును చక్కగా నిర్వహించి, సుందరీకరించాలన్నారు. జీఎన్ సి ఉప విచారణ కార్యాలయంలో గదుల కేటాయింపును, ధనప్రసాదం విక్రయాలను పరిశీలించారు.

# ఆచంటలో డ్వాక్రా గ్రూపులకు చెక్కుల పంపిణీ

ఏలూరు అక్టోబరు 09 పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గంలో జుత్తిగ , మల్లిపూడి , యస్.ఇలింద్రపర్రు, నత్తారామేశ్వరం,ఆలమూరు , భట్లమగుటూరు ,ఓడూరు ,నెలమూరు గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా ఫేజ్ 2 డ్వాక్రా గ్రూపు అక్కచెల్లెమ్మలకు 49.19 కోట్ల రూపాయలు చెక్కులు అందించారు మంత్రి రంగనాథ రాజు .ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు డ్వాక్రా గ్రూపు అక్కచెల్లెమ్మలు అనంతరం మంత్రి రంగనాథ రాజు మాట్లాడుతూ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ గారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వాన్ని సిగ్గు ,లజ్జ లేదు అని విమర్శించే హక్కులేదు అన్నారు. వైస్సార్ ఆసరా క్రింద అక్కచెల్లెమ్మలకు 49.19 కోట్లు మేము ఇవ్వడం తప్పు అని చెప్పమనండి అని ప్రశ్నించారు..ఆయన లాగా ప్రతి సంక్షేమ పథకాలలో పర్సన్ టేజ్ తీసుకోవడం లేదు.ఇక్కడ శాసన సభ్యులు గా 10 ప్రతి సంవత్సరం పనిచేసిన పితాని ప్రతి పనిలో అవినీతి సొమ్మును ఆశించారు. సీఎం రిలీఫ్ చెక్కును అందచేసే సమయంలో 11 శాతం లంచం ముందుగా తీసుకున్న చరిత్ర వాళ్ళది.. ఆయనకు 10 శాతం ..గుమస్తా కి ఒక శాతం. సర్పంచులు,ఎంపీటీసీలు అవినీతిపరులు అని.. ఇక్కడ పనిచేసే ఎమ్మెల్యేకు డబ్బు ఊరుకునే వచ్చేస్తుందట.. ఎలా వస్తుందో చెప్పాలి .నేను పుట్టడమే 1400 ఎకరాల కుటుంబంలోనే పుట్టాను.. పుట్టడమే కాదు ఎవరైనా ఆపదలో ఉంటే స్పందించే గుణం కూడా ఇచ్చాడు దేవుడు. ఇస్తున్నసంక్షేమ ఫలాలను.. మీ అకౌంట్లో వెయ్యొద్దు అని ధైర్యంగా ఆయను చెప్పమనండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పు చేసి చైనా, సింగపూర్,మలేషియా అంటూ మంత్రులను వెనకేసుకొని తిరిగేవారు ప్రజా ధనాన్ని వృధాగా ఖర్చు పెట్టారు. ఈరోజు కోర్టులో కేసు వేసి ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమాన్ని అపుతున్నారు.... అక్కాచెల్లెళ్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం తప్పా నేను ఎవరి దగ్గర లంచాలు తీసుకోలేదు వ్యాపారం చేసుకుంటూ వ్యవసాయం చేసుకుంటూ వచ్చిన రూపాయలు ప్రజలకు ఖర్చు చేస్తాను నా తల్లిదండ్రులు నాకు కన్నాలు వేయమని నేరపలేదు..నేను నా కొడుకుకి కన్నాలు వేయమని నేరపలేదు. స్కాములు లో ఇరుక్కుని కోర్టు నుంచి స్టే తెచ్చుకుని బ్రతుకుతున్నారో అందరికి తెలుసు. నన్ను గాని జగన్మోహన్ రెడ్డి ని విమర్శించే హక్కు మాజీ మంత్రి కి లేదు ఎద్దేవా చేశారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

### రామచంద్రపురం వైయస్సార్ ఆసరా సభలో మంత్రి వేణు

రామచంద్రాపురం అక్టోబరు 9, (న్యూస్ పల్స్ మహిళను అన్నిరంగాల్లోనూ అభివృద్ధి పరచాలని లక్ష్యంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వైయస్సార్ రెండో విడత ఆసరా పథకం కార్యక్రమం లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణు, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ ,మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి పాల్గొన్నారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మహిళలకు దసరా పండుగకు కానుకగా వైయస్సార్ ఆసరా పథకం ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాలకు 18 కోట్ల 64 లక్షల రూపాయల చెక్కును మంత్రి వేణు మహిళా సంఘాలకు అందజేశారు .ఈ కార్యక్రమంలో మూడు మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొనగా వారిని మంత్రి తనయుడు నరేన్ సన్మానించారు.

## ప్రొవిజన్ స్టోర్ ప్రారంభించిన పవిత్రా రెడ్డి

శ్రీకాళహస్తి అక్టోబరు 09 చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పట్టణం,కొండమిట్ట ప్రాంతానికి చెందిన కస్తురమ్మ అనే మహిళ 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా తాను లబ్ధి పొందిన సొమ్ముతో ప్రొవిషన్ స్టోర్ నూతనంగా ఏర్పాటు చేసుకున్నారు.ఈ ప్రొవిజన్ స్టోర్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్ర రెడ్డి ప్రారంబించారు. శ్రీపవిత్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీ అందరి బాధలుచూసి ఎన్నికల సమయంలో పొదుపు సంఘాలకు ఇచ్చిన హామిని నిలబెట్టుకుని మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఒకే ఒక్క నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని, నేడు వైయస్సార్ ఆసరా పేరిట మహిళల అకౌంట్ లో పడిన సొమ్ముతో శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్ట ప్రాంతం చెందిన ఈ మహిళ ప్రొవిషనల్ స్టోర్ పెట్టుకుని తన కాళ్ళపై తాను నిలబడి జీవనంసాగించడం ప్రతి ఒక్క మహిళా ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆమె మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 23 వ వార్డు ఇంచార్జి ఎం ఆర్ మురళి మరియు వైకాపా నాయకులు కార్యకర్తలు మహిలళలు పాల్గొన్నారు.

## జాజి పత్రి, పిస్తా, కర్జూరం, ఎండు ద్రాక్ష మాలలతో వేడుకగా శ్రీవారికి స్నపనం

### ప్రత్యేక ఆకర్షణగా పద్మ మండపం

తిరుమల, అక్టోబర్ 09 బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారి ఆలయంలో జాజి పత్రి, పిస్తా, కర్జూరం – పన్నీరు ఆకు, ఎండు ద్రాక్ష, రోజా పువ్వు రేకులతో ప్రత్యేకంగా రూపొందించిన మాలలు, కిరీటాలతో స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. రంగనాయకుల మండపంలో ప్రత్యేక వేదికపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి వేద మంత్రాల నడుమ కంకణభట్టార్ శ్రీ వాసుదేవ భట్టాచార్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన స్నపన తిరుమంజనంలో వివిధ రకాల మాలలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు కనువిందు చేశారు. పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేస్తుండగా, ప్రత్యేక మాలలను అలంకరించారు. జాజి పత్రి, పిస్తా, కర్జూరం – పన్నీరు ఆకు, ఎండు ద్రాక్ష, రోజా పువ్వు రేకులతో, బ్లూకలర్ పవిత్ర మాలలు, వట్టి వేరు, తులసితో తయారు చేసిన మాలలు అలంకరించామని ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు తెలిపారు.ఆకట్టుకున్న తామర పువ్వు మండపం స్నపనతిరుమంజనం నిర్వహించే రంగ నాయకుల మండపంలో తామర పువ్వు ఆకారంలో వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలు, ఆస్ట్రేలియా బత్తాయి, ద్రాక్ష గుత్తులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కమనీయంగా సాగిన ఈ స్నపన తిరుమంజనాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసింది.

## బద్వేలు ఉప ఎన్నికల పై వైకాపా భేటీ

కడప అక్టోబరు 09 కడప జిల్లా బద్వేలు ఉపఎన్నికలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బద్వేలు ఉపఎన్నికల ప్రచారం, ప్రణాళికలపై బూతు స్థాయి నేతలతో రాష్ట్రస్థాయి ముఖ్యనేతల సమావేశం లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయనంత అభివృద్ధి, సంక్షేమం వైఎస్ జగన్ అందించారని అన్నారు. .అన్ని వర్గాలకు చెందిన ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని. నలుగురు టీడీపీ ఎంపీలు కోవర్టులుగా బీజేపీలో చేరారు. వారి ఆధ్వర్యంలో బీజేపీ ఎన్నికల్లో పోటీ చేస్తోంది అంటున్నారని అన్నారు. . బీజేపీ నేతలు మాట్లాడుతున్న మాటలు ప్రజలు గమనిస్తున్నారు అని ఉపఎన్నికల్లో బీజేపీ కి గట్టిగా సమాధానం చెప్పే విధంగా భారీ మెజారిటీతో వైసీపీ అభ్యర్థి ని గెలిపించాలన్నారు. ఈ కార్య క్రమంలో డెప్యూటీ సీఎం అంజాద్ బాషా , ఎంపీ అవినాష్ రెడ్డి , వైసీపీ అభ్యర్థి డాక్టర్ సుధా, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదివారం అధునాతన జిమ్, యోగా కేంద్రాన్ని ప్రారంభించనున్న ఎంపి, ఎమ్మెల్యే ఆనంద్ గురూజీ

నంద్యాల అక్టోబరు 9,( విభారె) ఆయుష్ యోగా సేవాసమితి నిర్వాహకులు ఆనంద్ గురూజీ శారీరక, మానసిక, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించేదే యోగా అని, యోగాతో ఆరోగ్యంతో పాటు ఒత్తిడిని తట్టుకునే శక్తి కలిగి ఉంటుందని. ఆయుష్ యోగా సేవా సమితి నిర్వాహకులు ఆనంద్ గురూజీ పేర్కొన్నారు. మున్సిపల్ టౌన్ హాల్ పక్కన గల మున్సిపల్ పార్కునందు ఆయుష్ యోగా సేవా సమితి కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆనంద్ గురూజీతో పాటు సీనియర్ పాత్రికేయులు అండ్ 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ గురూజీ మాట్లాడుతూ ఈ నెల పదవ తేదీ ఆదివారం ఆయుష్ యోగా కేంద్రంలో 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అధునాతన జిమ్, అక్యుప్రెజర్ తదితర పరికరాలను నంద్యాల ఎంపి. పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిషోర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ షేక్ మాబున్నిసా, కమిషనర్ వెంకట కృష్ణుడు తదితరప్రముఖులు ప్రారంభిస్తారని తెలిపారు , కావున పుర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పదిహేను సంవత్సరాల నుండి తాను యోగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నానని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజల ఆరోగ్యమే మహా భాగ్యంగా, వారిని తీర్చిదిద్దేందుకు తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఆనంద్ గురూజీ తెలిపారు. నేటి ఆధునిక కాలంలో మనుషులు కాలంతో పోటీ పడుతూ తమ ఆరోగ్యాన్ని చేజేతులా పాడుచేసుకుంటున్నారని తెలిపారు , చిన్న తనంలోనే అనేక వ్యాధులు, రుగ్మతలు వస్తున్నాయని, వాటినిరూపుమాపేందుకు యోగా చక్కటి వ్యాయామమని పేర్కొన్నారు. 8 నెలల పాటు కష్టపడి యోగా సభ్యులతో దాదాపు 18 లక్షల విరాళాలు సేకరించి ఈ కేంద్రంలో జిమ్ తదితర పరికరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నడుము నొప్పి (బ్యాక్ పెయిన్), స్థూలకాయం (ఒబెసిటి), రక్తపోటు (బిపి), మధుమేహం (షుగర్) వున్న వారికి విడివిడిగా శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు , యోగాలో జలధౌతి, జలనేతి, సూత్రనేతి, వస్త్రధౌతి, సంఖ ప్రక్షాళన, క్రియలు నేర్పబడునని, కావున ఆసక్తి గల వారు ఈ యోగా కేంద్రంలో చేరి ఆరోగ్యవంతులుగా మెలగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ గురూజీ సతీమణి సులోచన, నాగరాజు, ఫణీంద్ర, సూర్య నారాయణ, ఎల్లయ్య, సుధ, సుకన్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# మీ భుజాలు, చేతులపై ఎర్రటి మచ్చలు ఉన్నాయా? అయితే ఇలా చేయండి.



మీ భుజాలు, చేతుల్లో ఎర్రటి మచ్చలతో మీకు అసౌకర్యం అనిపిస్తే, వాటిని వదిలించుకోవడానికి కొన్ని సాధారణ మార్గాలు ఉన్నాయి. ఈ ఎర్రటి మచ్చలను కెరాటోసిస్ ఫిలారిస్ అని కూడా అంటారు. అత్యంత సాధారణ మరియు హానిచేయని వాటిలో ఇవి ఒకటి. ఇవి జన్యువుల వల్ల కూడా సంభవిస్తాయి. ఈ చిన్న ఎర్రటి మచ్చలు తరచుగా చేతుల వెనుక భాగంలో సంభవిస్తాయి. ఈ ఎర్రటి మచ్చలు తరచుగా పెద్దల తొడలపై మరియు మైనర్ల వీపు, భుజాలపై మరియు బుగ్గలపై సంభవిస్తాయి. అంటే 50 శాతం పెద్దలలో 40 శాతం మంది కెరాటోసిస్ ఫిలేరియాసిస్‌తో బాధపడుతున్నారు. మీరు వీటిని కలిగి ఉండటం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.కెరాటోసిస్ హెయిర్ ఫోలికల్స్ చుట్టూ ఉన్న అదనపు కెరాటిన్ వల్ల కలుగుతుందని భావిస్తారు. చర్మం ఉపరితలంపై ఈ ఎర్రటి మచ్చలు వస్తాయి. కానీ ఇప్పటివరకు కెరాటోసిస్‌కు నివారణ కనుగొనబడలేదు. ఈ కెరాటోసిస్ ఫ్లోరిస్ వేసవిలో తక్కువ. చర్మం పొడిగా ఉన్నప్పుడు ఇది చాలా చెడ్డగా మారుతుంది. దీనికి కొన్ని చికిత్సలు ఉన్నాయి. కానీ పూర్తిగా తొలగించకపోతే వీటిని కొద్దిగా తగ్గించవచ్చు.మీ జుట్టు యొక్క ఉపరితలాన్ని నిరోధించడం ద్వారా ఈ ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి మీరు మీ చర్మంలోని చనిపోయిన కణాలను పునరుద్ధరించాలి. ఇందుకోసం మీ చర్మాన్ని ఎప్పటికప్పుడు తేమగా ఉంచడం చాలా అవసరం. అంటే, సాల్సిలిక్ యాసిడ్, గ్లైకోలిక్ యాసిడ్, యూరియా లేదా అమ్మోనియం లాక్టేట్ వంటి ఆమ్లాలు కలిగిన మాయిశ్చరైజర్లు ప్రభావవంతంగా ఉంటాయని వైద్యులు అంటున్నారు. అలాగే, మీరు ఉపయోగించే సబ్బుపై మీరు శ్రద్ధ వహించాలి, సబ్బు మీ చర్మాన్ని పొడి చర్మంగా మార్చకుండా చూసుకోవాలి.మాయిశ్చరైజర్లతో పాటు, మీరు మీ ఎర్రటి మచ్చలకు అవసరమైన క్రీములను వాడవచ్చు. గ్లైకోలిక్ ఆమ్లం మరియు ఆలా-హైడ్రాక్సీ ఆమ్లం కలిగిన క్రీములను కొనుగోలు చేసి ఉపయోగించవచ్చు. ఇవి చనిపోయిన కణాలతో తయారైన బాహ్యచర్మం యొక్క బయటి పొరలపై పనిచేస్తాయి. మరియు సహజంగా సంభవించే సాలిసిలిక్ ఆమ్లం, ఎక్స్‌ఫోలియేట్, బిస్ ఫినాల్ ఎ మరియు షియా బటర్‌లో ఎరుపు నిరోధక లక్షణాలు ఉంటాయి. జోజోబా ఆయిల్, క్రాస్‌బీట్ మరియు తీపి బాదం నూనెలు హార్డ్ పాచెస్‌ను మృదువుగా మరియు హైడ్రేట్ చేయడానికి సహాయపడతాయి. మీరు సరిపోయేటట్లు చూసినప్పుడు వీటిలో దేనినైనా ఉపయోగించవచ్చు.చర్మం తొలగింపు అనేది ఆలోచించాల్సిన విషయాల కంటే చాలా వేగంగా స్పందించే విషయం. 20 నుంచి 30 శాతం మంది వైద్యులు ఈ పద్ధతిని సిఫార్సు చేస్తున్నారు. అనగా గ్లైకోలిక్ ఆమ్లం చర్మంలోని చనిపోయిన కణజాలాన్ని బహిష్కరిస్తుంది. అప్పుడు, ఒక ఉపరితల గాయాన్ని ఏర్పరుస్తుంది. శరీరంలో సహజమైన వైద్యం ప్రక్రియను ప్రేరేపిస్తుంది మరియు కొత్త చర్మం పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఈ కొత్త చర్మం పెరిగేకొద్దీ మీరు కొంచెం మెరుగుపడటం గమనించవచ్చు.ఎర్రటి మచ్చలున్న ప్రదేశాలలో మీకు చాలా హెయిర్



హెయిర్ ఉంటే లేజర్ హెయిర్ రిమూవల్ పద్ధతిని నిర్వహించవచ్చని వైద్యులు అంటున్నారు. ఇంటెన్స్ పల్స్డ్ లైట్ (ఐపిఎల్) కిరణాలను సాధారణంగా చేతుల మూలాల నుండి జుట్టును తొలగించడానికి ఉపయోగిస్తారు. ఈ కిరణాలు కెరాటోసిస్ ఫ్లోరిస్‌లో స్వల్ప మార్పుకు కూడా కారణమవుతాయని వైద్యులు సూచిస్తున్నారు. కెరాటోసిస్ ఫిలేరియాసిస్ ఉన్నవారు లేజర్ హెయిర్ రిమూవల్ పద్ధతితో కొంత సంతృప్తి చెందుతున్నారని కూడా పేర్కొన్నారు.మీరు లేజర్ మరియు ఇతర ఆపరేషన్లలో పాల్గొనకపోతే మీరు సహజ మార్గంలో వెళ్ళవచ్చు. ఉత్తమ మార్గం కొబ్బరి నూనె. ఇది మీ చర్మంపై ఎర్రటి మచ్చలను తొలగించడంలో సహాయపడుతుంది. కెరాటోసిస్ ఫిలేరియాసిస్ ఉన్నవారు వెంటనే ఈ మార్గాన్ని అనుసరించవచ్చు. కొబ్బరి నూనె మీకు చాలా సులభంగా లభిస్తుంది. కొబ్బరి నూనెలో శోథ నిరోధక లక్షణాలు మరియు ఆరోగ్యకరమైన విటమిన్లు ఉన్నాయి. ఈ హైడ్రేట్ పొడి చర్మం. ఇవి దురదను తగ్గించడానికి మరియు ఎర్రటి మచ్చలు కనిపించకుండా ఉండటానికి సహాయపడతాయి.

# హిందూ వ్యతిరేక ఉగ్రవాదం నశించాలి

## విశ్వహిందూ పరిషత్

నంద్యాల అక్టోబరు 9,( విభారె) ఉగ్రవాద మూకల మరణ ఖాండకు నిరసనగా శనివారం నాడు నంద్యాల లో ధర్నా నిర్వహించారు. కొన్ని వందల సంవత్సరాలు గా భారతదేశం లో ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్ లాంటి సరిహద్దు ప్రాంతాలలో హిందువులపై జరుగుతున్న మారణ హోమాలు తగ్గుముఖం పడుతున్నాయనే అక్కసుతో ఎలాగైనా భారతదేశం లో కలసి మెలసి జీవిస్తున్నటువంటి వివిధ మతాల మధ్య అంతర్గత చిచ్చు పెట్టే కుట్ర తో హిందూ వ్యతిరేక ఉగ్రవాదం మళ్ళీ తమ కోరలు చాచిందని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఇటీవల శ్రీ నగర్ లోని ఒక పాఠశాల లో ఉపాధ్యాయుల సమావేశము జరుగుతుండగా కొందరు ఇస్లామిక్ తీవ్రవాదులు మారణాయుధాలతో వచ్చి వారిని ఒక వరుస లో నిల్చోబెట్టి తమ పేర్లు అడగటమే కాకుండా ఆధార్ కార్డులు చెక్ చేసి మరీ హిందువులైనటువంటి ప్రిన్సిపాల్ మరియుఉపాధ్యాయురాలిని కాల్చి చంపారన్నారు. నగర సహ కార్యదర్శి చిమ్మ రవి కుమార్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరిగినపుడు హిందూ సమాజమే కాకుండా రాజకీయ నాయకులు కూడా బయటకి వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు , ఆర్టికల్ 370 తీసివేయటం నోట్ల రద్దు లాంటి దేశ హిత కార్యక్రమాలతో నిర్వీర్యమైన ఉగ్రవాదుల కార్యకలాపాలు మళ్ళీ పాకిస్తాన్ సహాయం తో మొదలయ్యాయని ఇలాంటి చర్యలు మానుకోవాలని లేదంటే అఫ్ఘనిస్తాన్ కు పట్టిన గతే పాకిస్తాన్ కు పడుతుందని హెచ్చరించారు. డా: ఉదయ్ శంకర్ మాట్లాడుతూ కొన్ని వేల సంవత్సరాలు గా హిందువులు దాడులకు గురవుతున్నా చెక్కు చెదరని సమాజంగా ఉన్నారని ఇంకో లక్ష సంవత్సరాలు ప్రయత్నించినా భారత్ లో ఇస్లామిక్ రాజ్య స్థాపన చేయలేరని అన్నారు. కాశ్మీర్ లోని శ్రీనగర్ లోని జరిగిన సంఘటన చాలా బాధాకరం అని ఇలాంటి సంఘటనలను భారతీయ ముస్లిం లు కూడా ఖండించాలన్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఐయస్ ఐ యస్ . లష్కర్ ఏ తోయిబా లాంటి ఉగ్ర సంస్థలు హిందువుల పైనే కాకుండా ముస్లింల మసీదుల పై ఆత్మాహుతి దాడి ద్వారా 100 మంది అమాయక ముస్లిం ల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారని ఆయన అన్నారు , కాబట్టి ఇలాంటి సంఘటనలు మన రాష్ట్రం లో మన గ్రామంలో జరగబోవు అనే నిర్లక్ష్య భావన వీడి హిందూ సమాజం జాగృతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి , వీహెచ్పీ జిల్లా కార్యదర్శి పోలేపల్లి సందీప్ , సంఘమిత్ర కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్ ,రాష్ట్ర సేవికా సమితి మరియు వివిధ హిందూ సంస్థల ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు .

# అప్పలాయగుంట ఆలయ అభివృద్ధికి చర్యలు

- ఆదివారం నుంచి క్షురకులను రెట్టింపు చేయాలని అధికారులకు ఆదేశం
- భక్తులకు నీడ కల్పించడానికి చర్యలు

టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి

తిరుమల, , అక్టోబర్ 09 ,అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి చెప్పారు. శనివారం ఆయన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ, అప్పలాయగుంట ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కల్యాణ కట్ట లో భక్తులు అధిక సంఖ్యలో తలనీలాలు సమర్పిస్తున్నారని చెప్పారు. ఆదివారం నుంచి ఈ కల్యాణ కట్టలో సిబ్బందిని రెట్టింపు చేయడానికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఆలయంలో తగినంతమంది అర్చకులను కూడా నియమిస్తామన్నారు. శనివారం రోజు ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందువల్ల స్వామివారి దర్శనం కోసం ఎండలో నిలబడాల్సి వస్తోందని భక్తులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన సుబ్బారెడ్డి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు నీడ కల్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 11వ తేదీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి తిరుమల శ్రీవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. తిరుపతిలో చిన్న పిల్లల గుండె జబ్బు చికిత్స ఆసుపత్రిని ప్రారంభిస్తారన్నారు. అలిపిరి నుంచి తిరుమలకు దాత నిర్మించిన పైకప్పును, అలిపిరి వద్ద మరో దాత నిర్మించిన గోమందిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

# బాలయ్య మీద అంత బడ్జెట్ వర్కవుట్ అవుద్దా..?



నటసింహ నందమూరి బాలకృష్ణ – డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్ లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ "అఖండ" సినిమా షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమా కోసం సరైన రిలీజ్ డేట్ ని లాక్ చేయడానికి మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువ శాతం దీపావళి కి థియేటర్లలోకి తీసుకొచ్చే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.'అఖండ' సినిమాని భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ కలుపుకొని ఈ చిత్రానికి దాదాపు 95 కోట్ల వరకు ఖర్చు అయిందని ప్రచారం జరుగుతోంది. ఇదే కనుక నిజమైతే ఇది బాలయ్య కెరీర్ లోనే అత్యధిక బడ్జెట్ సినిమా అవుతుంది. 'సింహా' 'లెజెండ్' వంటి సూపర్ హిట్ సినిమాల తార బోయపాటి శ్రీను – బాలకృష్ణ కాంబోలో వస్తున్న ఈ హ్యాట్రిక్ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికి తగ్గట్లుగానే ఖర్చుకు వెనుకాడకుండా ఈ సినిమాని రూపొందించారట. కరోనా కారణంగా షూటింగ్ డిలే అవడం కూడా బడ్జెట్ పెరగడానికి ఒక కారణమని తెలుస్తోంది.కారణలేవైతేనేం ప్రస్తుత పరిస్థితుల్లో అంత భారీ బడ్జెట్ వర్కౌట్ అవుద్దా అని ఇప్పుడు సినీ వర్గాల్లో కామెంట్స్ వినిపిస్తున్నాయి. కరోనా పాండమిక్ తర్వాత థియేటర్ బిజినెస్ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. బ్లాక్ బస్టర్ టాక్ వచ్చిన సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఎక్కువ కలెక్షన్స్ రాబట్టలేకపోయాయి. మరి ఇప్పుడు 'అఖండ' చిత్రానికి ఎక్కువ బడ్జెట్ పెట్టారని అంటున్నారు. బాలయ్య గత చిత్రాలు కూడా ఈ రేంజ్ వసూళ్ళు సాధించలేదు. ఇప్పుడు ఒకవేళ ఈ సినిమా రిజల్ట్ తేడా కొడితే మాత్రం నిర్మాతలకు ఇబ్బందే అనుకోవాలి. ఏమి జరుగుతుందో చూడాలి.ఇకపోతే 'అఖండ' సినిమాతో బాలకృష్ణ – బోయపాటి కలిసి హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంటారని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. బాలయ్య ఇందులో ఇంతకు ముందెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపించనున్నారు. బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తుండగా.. వాటిలో ఒకటి అఘోరా పాత్ర. ఇప్పటికే విడుదలైన రెండు పాత్రలకు సంబంధించిన టీజర్లు విశేష స్పందన తెచ్చుకున్నాయి.'అఖండ' చిత్రంలో బాలకృష్ణ సరసన ప్రగ్యా జైశ్వాల్ హీరోయిన్ గా నటిస్తోంది. అయితే తాజాగా ఈ సినిమా షూటింగ్ మొత్తం కంప్లీట్ అయినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జగపతిబాబు – శ్రీకాంత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. థమన్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చగా.. సి రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్ గా వర్క్ చేస్తున్నారు. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో ద్వారకా క్రియేషన్స్ బ్యానర్ పై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# మహేష్ రిజెక్ట్ చేసిన స్టోరీతో ప్రభాస్ సినిమా..?

'అర్జున్ రెడ్డి' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన సందీప్ రెడ్డి వంగా.. ఫస్ట్ మూవీతోనే సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఆ తర్వాత అదే చిత్రాన్ని 'కబీర్ సింగ్' పేరుతో రీమేక్ చేసి సూపర్ హిట్ అందుకున్నారు. ఇదే క్రమంలో హిందీలో 'యానిమల్' అనే మరో సినిమాని అనౌన్స్ చేశాడు కానీ.. రణబీర్ కపూర్ ఇతర ప్రాజెక్ట్స్ తో బిజీగా



ఉండటంతో సెట్స్ మీదకు వెళ్ళలేదు. ఇప్పుడు తాజాగా యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తో "స్పిరిట్" అనే పాన్ ఇండియా మూవీని ప్రకటించారు.'స్పిరిట్' కంటే ముందు పలువురు స్టార్ హీరోలతో సందీప్ వంగా సినిమా చేయబోతున్నారని ఎన్నో వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ముఖ్యంగా సూపర్ స్టార్ మహేష్ బాబు తో సినిమా చేయనున్నాడని ఎక్కువగా చెప్పుకున్నారు. నిజానికి 'అర్జున్ రెడ్డి' తర్వాత మహేష్ ని కలిసి ఓ పవర్ ఫుల్ కథ ను వినిపించాడు. అయితే మహేష్ ఆ స్టోరీని సున్నితంగా తిరస్కరించడంతో ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు.ఇటీవల మహేశ్ బాబు పుట్టిన రోజు స్పెషల్ ట్విట్టర్ స్పేస్ సెషన్ లో పాల్గొన్న సందీప్ వంగా.. సూపర్ స్టార్ కథ చెప్పిన విషయాన్ని వెల్లడించారు. తను చెప్పిన స్టోరీ మహేష్ కు నచ్చలేదని.. మరో కొత్త స్క్రిప్ట్ తో కలుస్తానని చెప్పాడు. మహేష్ తో కచ్చితంగా సినిమా చేస్తానని సందీప్ తెలిపారు. అయితే ఇప్పుడు ప్రభాస్ తో చేస్తున్న స్పిరిట్ సినిమా.. ఇంతకముందు మహేష్ కు చెప్పిన కథతోనే అని టాక్ వినిపిస్తోంది.సందీప్ వంగా మొదట మహేష్ బాబు కు చెప్పిన స్టోరీలో కొన్ని మార్పులు చేర్పులు చేసి ప్రభాస్ కు వినిపించారట. ప్రభాస్ బాడీ లాంగ్వేజ్ కు స్టైల్ కు తగ్గట్లుగా హీరో క్యారెక్టరైజేషన్ ను మార్చారట. ప్రభాస్ ను ఇంతకు ముందెన్నడూ చూడని సరికొత్త అవతారంలో చూపించబోతున్నామని మేకర్స్ తెలిపారు. అది ఓ పోలీస్ ఆఫీసర్ రోల్ అని టాక్ నడుస్తోంది. ఇందులో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే.ఇకపోతే 'స్పిరిట్' సినిమా ప్రభాస్ కెరీర్ లో మైలురాయి 25వ ప్రాజెక్ట్. పాన్ ఇండియా స్థాయిలో టి సిరీస్ – యూవీ క్రియేషన్స్ మరియు సందీప్ వంగా సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ కలిసి భారీ బడ్జెట్ తో నిర్మించబోతున్నాయి. భూషణ్ కుమార్ – వంశీ – ప్రమోద్ – వంగా ప్రణయ్ రెడ్డి దీనికి నిర్మాతలు. ప్రభాస్ తో 'సాహో' 'రాధే శ్యామ్' వంటి సినిమాలు చేసిన టీ సిరీస్ వారు ప్రస్తుతం 'ఆది పురుష్' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక సందీప్ ఇంతకముందు ఇదే బ్యానర్ లో 'కబీర్ సింగ్' సినిమా చేసిన సంగతి తెలిసిందే. మరి ఇప్పుడు 'స్పిరిట్' చిత్రాన్ని 'యానిమల్' కంటే ముందు సెట్స్ మీదకు తీసుకెళ్తారా? లేదా తర్వాత షూటింగ్ చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

# బుడాపెస్ట్ కి బయల్దేరుతున్న 'ఏజెంట్'




అక్కినేని వారసుడు అఖిల్ కథానాకుడిగా స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి దర్శకత్వంలో 'ఏజెంట్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆంధ్రాలో ఉన్న పోర్టులన్నింటిని చుట్టేసింది. అక్కడ కీలక యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కించారు. నెల్లూరు కృష్ణపట్నం పోర్టు..విశాఖ పోర్టు లో అఖిల్ పై యాక్షన్ ఎపిసోడ్లను చిత్రీకరించారు. హైదరాబాద్ ఆర్ ఎఫ్ సీలో నూ కొన్ని కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించారు.తాజాగా యూనిట్ యూరప్ ఫ్లైట్ ఎక్కడానికి రెడీ అవుతోంది. బుడాఫెస్ట్ లో ఈనెల 20 నుంచి కీలక సన్నివేశాల్ని చిత్రీకరించే షెడ్యూల్ వేసిన ట్లు సమాచారం. ఈ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని యూనిట్ వర్గాల సమాచారం. ఇక 'ఎజెంట్' సినిమా విషయానికి వస్తే ఇదొక హనీట్రాప్ కథాశం అని.. ఇందులో అఖిల్ ఓ 'ఏజెంట్' పాత్రలో కనిపించనున్నారని సమాచారం.ఇక అఖిల్ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' ఈనెల 15న రిలీజ్ అవుతోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో ఆ తేదీకి రిలీజ్ చేయాలని యూనిట్ భావిస్తోంది. ఈ సినిమాపై అఖిల్ చాలా ఆశలు పెట్టుకున్నాడు. విజయం అందుకుని కెరీర్ లో బెస్ట్ హిట్ గా నిలుపుకోవాలని ఆశపడుతున్నాడు.

# రవిశాస్త్రి స్థానంలో ఆయనా?!




టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ముగిసిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ రవిశాస్త్రి తన పదవి నుంచి తప్పుకోనున్నారన్న వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాబోయే కోచ్‌లుగా అనిల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్ తదితరుల పేర్లు తెరమీదకు వచ్చాయి. తాజాగా… మరో కొత్త పేరు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్ డైరెక్టర్ టామ్ మూడీ భారత జట్టు కోచ్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఈ దిశగా ఎస్ఆర్‌హెచ్ పెద్దలు పావులు కదుపుతున్నారనే పుకార్లు షికారు చేస్తున్నాయి."సన్‌రైజర్స్ వరుస వైఫల్యాల నేపథ్యంలో డేవిడ్ వార్నర్ వంటి స్టార్ ప్లేయర్ల పట్ల కఠిన వైఖరి అవలంబించడం సహా.. యువ ఆటగాళ్లతో జట్టును నింపాలని గట్టిగా వాదించడం సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్న టామ్ మూడీ.. టీమిండియా కోచ్‌గా వస్తే మెరుగైన ఫలితాలు తీసుకురాగలడు"అని భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్ణయాలపై ప్రభావం చూపగల ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంఛైజీ పెద్దలు అధికారుల వద్ద ప్రస్తావించినట్లు ఓ వార్త చక్కర్లు కొడుతోంది. అయితే, ఇందులో ఎంతవరకు వాస్తవం ఉందనేది బీసీసీఐ ప్రకటన తర్వాతే తేలుతుంది. కాగా తొలి టైటిల్(2016) సాధించిపెట్టిన వార్నర్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించడం సహా తుది జట్టు నుంచి కూడా ఫ్రాంఛైజీ అతడిని తప్పించిన సంగతి తెలిసిందే. వార్నర్ స్థానంలో కేన్ విలియమ్సన్‌ను సారథిగా నియమించారు. ఈ నిర్ణయాల వెనుక టామ్ మూడీ హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పలు మార్పులు చేసినప్పటికీ హైదరాబాద్ ఈ సీజన్‌లో దారుణంగా విఫలమైన సంగతి తెలిసిందే. 14 మ్యాచ్‌లలో కేవలం 3 మాత్రమే గెలిచి.. పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ టామ్ మూడీ టీమిండియా హెడ్ కోచ్ రవిశాస్త్రి స్థానాన్ని భర్తీ చేసే అవకాశం ఉందన్న వార్తలు ఆసక్తికరంగా మారాయి. ఇక గతంలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ గ్రెగ్ చాపెల్, దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు గ్యారీ కిర్‌స్టెన్ తదితర విదేశీ కోచ్‌లు టీమిండియాకు శిక్షణ ఇచ్చిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**